SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 48 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 27 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |




# కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం

- దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు
- అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు
- 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం
- రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్



3

దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు ప్రకటించారు.



## పాకిస్తాన్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ హత్య..!!

ఆఫ్ఘన్ మీడియా సంచలన ప్రకటన

ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్

.. వివరాలు 4లో



# జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

## వర్చువల్‌గా ప్రారంభించిన మోడీ అభినందనలు తెలియచేసిన సీఎం



**హైదరాబాద్, నవంబర్ 26:** తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్ లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాం నెలకొల్పుతున్న సెంటర్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో వాణిజ్యా ఇంజిన్‌ల మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (MRO)సెంటర్ అని తెలిపారు. రూ. 1,300

మిగతా 2 లో



2

# ‘బడే భాయ్’ ప్రభావం!

రాజకీయాలపై పెను దుమారం!?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేసిన హఠాత్ పర్యటన, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేవలం ఎనిమిది నిమిషాల వ్యవధి కోసం హాజరై రావడం రాష్ట్ర రాజకీయాలలో తీ వ్ర చర్చకు తెర తీసింది. గతంలో ఆయన కేంద్ర మంత్రులను ఉద్దేశించి చేసిన ‘బడే భాయ్’ వంటి వ్యాఖ్యలను పరిగణనలోకి తీసు కుంటే, ఆకస్మిక పర్యటన కేవలం ఒక రాజ్యాంగ కార్యక్రమం కాద ని, కేంద్రంలోని పాలకులకు, కీలక అధికార వర్గాలకు ముఖ్యమంత్రి పంపుతున్న ఒక పరోక్ష సంకేతంగా విశ్లేషించవచ్చు.

..6 లో




## అవినీతి అనకొండ రేవంత్

మున్సిపాలిటీల విలీనం దారుణం మండిపడ్డ కేటీఆర్

భూములు ప్రజల సొత్తని.. అబ్బ సొత్తు అన్నట్టు, నీ అత్త సొమ్ము అన్నట్టు’ దానం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ హెచ్చరించారు.

.. వివరాలు 3లో





## జనాభా లెక్కలకు భిన్నంగా రిజర్వేషన్లు

- హైకోర్టులో కేసు దాఖలు
- విచారణ రేపటికి వాయిదా

2

## తొలి ఏకగ్రీవ ఎన్నిక



2

సిరిసిల్ల జిల్లాలో గ్రామస్తుల తీర్మానం

## నకిలీ మద్యం తయారీ కేసు..

- జోగి బ్రదర్స్‌ను తొలిరోజు ప్రశ్నించిన ఎక్సైజ్ పోలీసులు..
- కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాము..
- 4 రోజులపాటు విచారించటానికి ఎక్సైజ్ కోర్టు అనుమతి..
- తొలి రోజు సుమారు అరగంటపాటు ప్రశ్నించిన పోలీసులు..

2


# మహిళల వ్యక్తిత్వ హననాన్ని అరికట్టాలి

ఆడపిల్లల్లా ఏడవవద్దు, గాజులు తొడుక్కున్నావా అనడం మానుకోవాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు
- అమరావతిలో ‘మాక్ శాసనసభ’
- అసెంబ్లీలో అదరగొట్టిన విద్యార్థులు

**అమరావతి :** సమాజంలో మహిళలను కించపరిచేలా, వారి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సాగుతున్న ధోరణులకు అడ్డుకట్ట పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో హద్దులు లేకుండా కొందరు మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని, ఈ దుష్ప్రచారాన్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి నేటి ఆడపిల్లలకు రావాలని ఆయన

మిగతా 5 లో





## ఫిబ్రవరి 25 నుండి ఇంటర్ పరీక్షలు

విద్యార్థుల వివరాల్లో పొరపాట్ల సవరణకు బోర్డు కొత్త మార్గదర్శకాలు

30 వరకు నామినల్ రోల్స్‌లో తప్పులు సరిచేసుకునే అవకాశం

2

## వాయుగుండంగా అల్పపీడనం

- పశ్చిమ-వాయువ్య దిశగా పయనం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన

2

# ప్రభుత్వ శాఖలో రహస్యాలు ఎందుకు?!

ప్రజల ఆరోగ్యం, ఆహార భద్రత వంటి కీలక అంశాలను పర్యవేక్షించే ప్రభుత్వ శాఖలో రహస్యాలు ఎందుకు దాచాలి. ఆదిలాబాద్ ఆహార భద్రతా అధికారి విలేకరులను “మా పైఅధికారులు నువ్వా”, “నీకెందుకు సమాచారం ఇవ్వాలి” అంటూ తీవ్రంగా నిరాకరించడం, బెదిరింపు ధోరణి ప్రదర్శించడం ప్రభుత్వ పారదర్శకత సిద్ధాంతాన్ని పూర్తిగా ధిక్కరించడమే.





వివరాలు 6వ పేజీలో



## సర్వీస్ రివాల్వర్ అమ్మేసిన ఎస్ఐ!

- అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు
- అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఘటన

3



# తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు

**సిరిసిల్ల, నవంబర్ 26:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులాతండాలో సర్పంచ్ పదవికి జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.గ్రామస్థులంతా కలిసి సంబరాలు చేసుకుంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. తన విజయంపై స్పందించిన సర్పంచ్ జవహర్ లాల్ నాయక్.. గ్రామ ప్రజలు చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పంచాయతీ పరిధిలో అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తండా అభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల, ప్రజల కోరికలను నెరవేర్చడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

# బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరలో కార్యరూపం

## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్



**హైదరాబాద్, నవంబర్ 25:** చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది.తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది.సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు.దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది. భూసేకరణపై జాప్యాన్ని నివారించేందుకు త్వరగా స్థలాల ఖరారు చేయాలని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

# వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

## పశ్చిమ-వాయువ్య దిశగా పయనం ● తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన

**హైదరాబాద్, నవంబర్ 26:** తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశలో కదిలి మరింతగా బలపడనుంది. మధ్య బంగాళాఖాతానికి చేరే క్రమంలో బలహీనపడనుంది. అటు బుధ, గురువారాల్లో వాయుగుండం దిశపై మరింత స్పష్టత లభించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే శ్రీలంక-నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో మరొక అల్పపీడనం ఏర్పడింది. బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. తర్వాతి 24 గంటల్లో ఇది కూడా వాయుగుండంగా బలపడే ఛాన్స్ ఉందన్నారు. రెండు వాయుగుండాలు ఉత్తర తమిళనాడు తీరం దిశగా కదలనున్నాయని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత కోస్తాంధ్ర వైపునకు చేరుకుని బలహీనపడనున్నాయి. నవంబర్ 30, డిసెంబర్ 1న తెలంగాణలో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.మరోవైపు వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో చలి తగ్గింది. మెదక్‌లో 13.8 డిగ్రీలు, పటాన్ చెరువులో 14.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 14.7 డిగ్రీలు, హయత్ నగర్‌లో 15 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 17 డిగ్రీలు, హనుమకొండలో 17.5 డిగ్రీలు, రామగుండంలో 17.5 డిగ్రీలు, నిజామాబాద్‌లో 17.6 డిగ్రీలు, దుండిగల్‌లో 17.7 డిగ్రీలు, నల్లగొండలో 18.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 18.2 డిగ్రీలు, హకింపేట్‌లో 18.7 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 19.1 డిగ్రీలు, ఖమ్మంలో 20.4 డిగ్రీలు, భద్రాచలంలో 20.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఏపీపై కూడా వాయుగుండం ప్రభావం పడనుంది. రేపటి నుంచి మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లరాదని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లినవారు వెంటనే తిరిగి ఒడ్డుకి రావాలని సూచించింది. వాతావరణ ప్రభావంతో నవంబర్ 29 - డిసెంబర్ 2 వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలంది.



# జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

మొదటి పేజీ తరువాయి

కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ స్థానిక ఎంఎస్ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఇవాళ సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ఈ ఎమ్ఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్.. భారతదేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500 కి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని సీఎం తెలిపారు.భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు గత ఏడాది రెట్టింపు అయ్యాయన్నారు. 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర



విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమని చెప్పుకొచ్చారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను (ఐటీఐఎస్) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు. 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047 - గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. బెంగళూరు-హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాటు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

# రవి సినిమాలు పైరసీ చేయలేదు

## ఐబొమ్మ కేసులో కొత్త ట్విస్ట్!

## విచారణలో కీలక విషయాలు వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 25:** తెలుగు సినీ పరిశ్రమ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టి పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఐదురోజుల పోలీసు కస్టడీలో సైతం నిందితుడు రవి వద్ద నుంచి కీలక సమాచారాన్ని తెలంగాణ పోలీసులు రాబట్టారు. మరి కొన్ని విషయాల్లో ఇంకా క్లారిటీ రావాల్సిన అవసరం ఉంది. తాజా మరో వారం రోజులపాటు పోలీసు కస్టడీ కోరుతూ నాంపల్లికోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. తాజాగా నిందితుడు రవి ఏ సినిమాలు పైరసీ చేయలేదంటూ మరో బాంబు పేల్చారు పోలీసులు. ఐబొమ్మ, బప్పం పైరసీ వెబ్ సైట్‌ల ద్వారా చట్టవిరుద్ధంగా సినిమాలను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు, ఆయా వెబ్ సైట్ల ద్వారా గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించిన మాట వాస్తవమేనని, కానీ అప్పుడే విడుదలైన కొత్త సినిమాలను పైరసీ చేయడంలో ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవికి ఎటువంటి ప్రమేయం లేదని తేల్చినట్లు సమాచారం. మూవీ రూల్స్ , తమిళ్ ఎంవీ ద్వారా పైరసీ సినిమాలను కొనుగోలు మాత్రమే రవి చేసేవాడని, అలా కొనుగోలు చేసిన కొత్త



సినిమాలు క్వాలిటీ తక్కువగా ఉండేవని, అలా పూర్ క్వాలిటీతో కొన్న పైరసీ సినిమాలను టెక్నాలజీ ఉపయోగించి, హెచ్ డీ క్వాలిటీలోకి మార్చి ఐబొమ్మ, బప్పం వెబ్ సైట్‌లో పోస్ట్ చేసేవాడని తేల్చారు. దీంతో సినిమా పైరసీ కేసుల నుంచి ఐబొమ్మ రవికి కాస్త ఊరట లభించినట్లయ్యింది. కానీ గేమింగ్ యాప్‌లు ప్రమోట్ చేయడం, బెట్టింగ్ యాప్ లను తన వెబ్ సైట్ ల ద్వారా ప్రమోట్ చేయడం ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించడంతో రవి అడ్డంగా బుక్కైనట్లయ్యింది. ఐబొమ్మ రవి పోలీసులకు చిక్కడానికి కారణం తన గొయ్యి తానే తవ్వుకోవడం. తన డొమైన్‌ను తన సొంత అడ్రస్, ఈమెయిల్ ఐడీ, క్రెడిట్ కార్డు ఉపయోగించి కొనుగోలు చేయడమే రవి ఈజీగా ఖాకీలకు చిక్కేలా చేసింది. మొదట ఎన్‌జలా అనే కంపెనీ ద్వారా డొమైన్ రిజిస్ట్రేషన్ చేసిన రవి, ఐపీ వాల్యూమ్ అనే కంపెనీ ద్వారా హోస్టింగ్ వ్యవహారాలు మ్యానేజ్ చేసేవాడు. కంటెంట్ మ్యానేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఈ మొత్తం వ్యవస్థను నడిపించేందుకు ఔట్ సోర్సింగ్ టీమ్ ఏర్పాటు చేసినట్లుగా నిర్ధారించారు. ఇలా వీళ్లెవరికీ రవితో సంబంధాలు లేవు. ఎవరెవరు, ఎక్కడి నుంచి ఎవరి కోసం పని చేస్తున్నారో తెలియకుండా ఈ మొత్తం వ్యవహారం నడిపించాడు.ఐబొమ్మ వెబ్ సైట్‌లోకి వెళ్లి సినిమా లింక్‌పై క్లిక్ చేయగానే వెంటనే యూజర్స్ ను గేమింగ్ యాప్, బెట్టింగ్ యాప్‌లకు రీడైరెక్ట్ చేసేలా బప్పం, ఐబొమ్మ పైరసీ వెబ్ సైట్లను డిజైన్ చేశాడు. అలా యూజర్ ఎంగేజ్మెంట్ ఆధారంగా బెట్టింగ్, గేమింగ్ యాప్ కంపెనీలు రవికి డబ్బులు చెల్లించేవి. లక్ష వ్యూవర్స్‌కు ఇంత మొత్తంలో డబ్బు చెల్లించేలా ముందుగానే మాట్లడుకునేవాడు. అలా ఆయా కంపెనీల నుంచి వచ్చిన డబ్బును ఇండియాలో తన బ్యాంక్ అకౌంట్‌కు మళ్లించేవాడు. అలా వచ్చిన డబ్బును వచ్చినట్లు మంచినీళ్లలా విదేశీ పర్యటనల కోసం ఖర్చు చేసేవాడట. ఇలా పైరసీ సినిమాలు మాత్రమే కొనలేదుకానీ, మిగతా చట్టవిరుద్ధమైన గేమింగ్ యాప్ ప్రమోషన్‌లతో కోట్లు దండుకోవడం నిందితుడి కొంపముంచింది.

# జనాభా లెక్కలకు భిన్నంగా రిజర్వేషన్లు

## హైకోర్టులో కేసు దాఖలు

**హైదరాబాద్, నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జీవోకు విరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయిస్తున్నారంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వేర్వేరుగా దాఖలైన 9 పిటిషన్లపై జస్టిస్ టి.మాధవి దేవి విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు 17 శాతానికి మించడంలేదని సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రామసానిపల్లికి చెందిన మాజీ సర్పంచి ఆగమయ్య పిటిషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 613 గ్రామ పంచాయతీలుండగా.. 117 సర్పంచి స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గెజిట్ 43ను జారీ చేశారని వాదించారు. దీని ప్రకారం బీసీ రిజర్వేషన్లు 19శాతం మాత్రమే ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులకు బీసీ రిజర్వేషన్లు 17శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 46కు విరుద్ధంగా ఈ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. సంగారెడ్డి కలెక్టర్ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేసి.. రిజర్వేషన్లు మళ్లీ కేటాయించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ మండలం తిమ్మనోనిపల్లి రిజర్వేషన్లపై మరో పిటిషన్ దాఖలైంది. గ్రామంలో 8 వార్డులుండగా అన్నింటినీ ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారని.. బీసీ జనాభా ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచుల రిజర్వేషన్లు కేటాయించినట్లు స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి కోర్టుకు తెలిపారు. రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు మారుతూ వస్తాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 2011 జనాభా గణనలో తప్పులున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారని.. దీనికి కేంద్రమే సమాధానం చెప్పాల్సి ఉందని రాహుల్ రెడ్డి వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

# ఫిబ్రవరి 25 నుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- విద్యార్థుల వివరాల్లో పొరపాట్ల సవరణకు బోర్డు కొత్త మార్గదర్శకాలు
- 30 వరకు నామినల్ రోల్స్‌లో తప్పులు సరిచేసుకునే అవకాశం
- తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపనున్న ఇంటర్ బోర్డు
- విద్యార్థులకు అలర్ట్.. బోర్డు కొత్త మార్గదర్శకాలు




**హైదరాబాద్, నవంబర్ 26:** తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత వివరాలు తప్పుగా నమోదు కావడం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. పేరు, తండ్రి పేరు, గ్రూపు, మాధ్యమం, భాషా సబ్జెక్టులు వంటి కీలక అంశాల్లో తేడాలు రావడం వల్ల పరీక్ష సమయాన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. గతంలో పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు ఓఎంఆర్ పత్రాల్లో తప్పులు సవరించుకునే అవకాశం ఉండేది. చాలా సందర్భాల్లో తెలుగు స్థానంలో హిందీ ముద్రించబడడం, గ్రూప్ మారడం, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా రావడం వంటి సమస్యల్ని అప్పటికప్పుడు సరిచేసుకునే అవకాశం ఉండేది. అయితే ఈసారి పరీక్ష కేంద్రాల్లో అలాంటి అవకాశం ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనికి బదులుగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షలకు ముందుగానే వివరాల సవరణకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం డీఐఈవోలకు మరియు కాలేజీ ప్రిన్సిపాళ్లకు బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి కాలేజీ ప్రిన్సిపాళ్లు నామినల్ రోల్స్‌ను చూపించి, అందులో ఉన్న అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కాలేజీలకు పిలిపించి వివరాలను క్రాస్ చెక్ చేయించి సంతకాలు తీసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ ద్వారా ఓఎంఆర్ పత్రాల్లో వచ్చే పొరపాట్లను ముందుగానే పూర్తిగా నివారించవచ్చని బోర్డు భావిస్తోంది. అంతేకాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో చదువుతున్న దాదాపు 10 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షల ఫీజులు, గడువులు, నామినల్ రోల్స్ పరిశీలన, ప్రాక్టికల్స్ షెడ్యూల్ వంటి సమాచారాన్ని ఎస్ఎంఎస్‌ల రూపంలో పంపించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు నవంబర్ 30 వరకు తమ నామినల్ రోల్స్‌లో ఉన్న పొరపాట్లను సవరించుకునే అవకాశం కల్పించింది. ఫీజు గడువు ముగిసిన తరువాత కూడా మరోసారి సవరణ అవకాశం ఇవ్వనున్నట్లు బోర్డు తెలిపింది. ప్రస్తుతం 92!! మంది విద్యార్థులు ఇప్పటికే పరీక్ష ఫీజులు చెల్లించడంతో, వివరాల ధృవీకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ విధంగా, ఇంటర్ బోర్డు విద్యార్థుల వివరాలను ఖచ్చితంగా సరిచేసుకునే అవకాశం అందించి, పరీక్షల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే నివారించడానికి చర్యలు చేపట్టింది.

# అవినీతి అనకొండ సీఎం రేవంత్

- ముున్సిపాలిటీల విలీనం దారుణం
- మండిపడ్డ మాజీ మంత్రి కేటీఆర్



**వరంగల్, నవంబర్ 26:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది. అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు. 'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్సిపాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు. అఖిలపక్ష సమావేశం పెట్టి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకున్నారా ? శాసనసభ పెట్టి సభ్యుల అభిప్రాయం తీసుకున్నారా అంటే అదీ లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం, ఎవరి శాశ్వత దీర్ఘకాలిక ఆలోచనల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందో మాకైతే తెలియడం లేదు. ఏ కారణం చేత ఈ ప్రతిపాదనను తెచ్చారో కూడా స్పష్టంగా లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది' అన్నారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో కొత్త పాలసీని తీసుకువచ్చారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు అపార్ట్‌మెంట్లకు ఇస్తున్నారు. గతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ప్రజలను ఒప్పించి, ఉపాధి అవకాశాల కోసం భూములను సేకరించిన తీరుగానే, గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో 9,300 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించాయి. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకి భూములు తీసుకొని, వారికి తక్కువ ధర ఇచ్చి, సబ్సిడీపై పరిశ్రమలకు భూములిచ్చిన తర్వాత పరిశ్రమలు నడవాలి. ఉపాధి దొరకాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. రాష్ట్ర ఆదాయం పెరగాలని మేము ఆశిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారి వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. హైదరాబాద్‌లోని పరిశ్రమల యజమానులు వచ్చి,అపార్ట్‌మెంట్లు కట్టుకుంటాం, మాల్స్ కట్టుకుంటాం అంటే.. వారికి అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రిజిస్ట్రేషన్ ధరకు కాకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30శాతం మాత్రమే చెల్లించి, భూమిని కన్వర్ట్ చేసుకోవడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు' అని ఆరోపించారు. 'హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో పార్కులకు, పార్కింగ్‌లకు, బొందలగడ్డలకు, ఇల్లు కట్టుకోవడానికి జాగా లేదు. వీటికి జాగాలు వద్దట. కానీ, పారిశ్రామికవేత్తలు అడ్డికి పావుశేరుకు కొనుక్కున్న, ప్రభుత్వం ఇచ్చిన భూములను వారు ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటే మాత్రం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపుతున్నారు. 9,300 ఎకరాల భూమి దాదాపు రూ.5లక్షల కోట్ల విలువైన ఆస్తి. దేశంలోని ఇతర రాష్ట్రాలు (ఉదాహరణకు ముంబయి) మిల్స్ కోసం ఇచ్చిన భూములను 50శాతం వెనక్కి తీసుకొని, ప్రజల అవసరాల కోసం వినియోగిస్తున్నాయి. రేవంత్ రెడ్డి 'అవినీతి అనకొండ' అని.. రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు, ఆయన అనుయాయులతో కలిసి ఒక అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ అవినీతి అనకొండ విశ్వరూపం ఏమిటంటే..రూ.5 లక్షల కోట్లు విలువైన తెలంగాణ ప్రజల ఆస్తిని దోచుకుపోవడానికి, ఉద్దేశపూర్వకంగా గత ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా


- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, నవంబర్ 26:** అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు. 21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు. ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపైనో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.

# నేటితో ముగియనున్న జేఈఈ మెయిన్ తొలి విడత రిజిస్ట్రేషన్లు

**న్యూఢిల్లీ, నవంబర్ 26:** దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ (మెయిన్-2026 తొలి విడత ఆన్‌లైన్ రిజిస్ట్రే షన్లు నేటితో ముగియనున్నాయి. నవంబర్ 27 రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదేరోజు రాత్రి 11:50 గంటల్లోగా ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులకు అవకాశం ఉ ంటుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే డిసెంబర్ 1 నుంచి 2వ తేదీ రాత్రి 11.50 వరకు సవరించుకునేందుకు అవకాశం కల్పించింది. జేఈఈ మెయిన్ మొదటి విడుత పరీక్ష రోజుకు రెండు సెషన్లలో జనవరి 21 నుంచి 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆయా తేదీల్లో ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. ఇందులో వచ్చిన స్కోర్ ఆధారంగా ఎన్ఐటీ, ఐఐటీ, జీఎఫ్‌టీఐ వంటి ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ మెయిన్ పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహిస్తుంది. తెలుగు, ఇంగ్లిష్ సహా హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ భాషల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. మొదటి సెషన్‌లో పరీక్షలు రాసిన విద్యార్థులు రెండో సెషన్ పరీక్షలు కూడా రాయవచ్చు. రెండింటిలో బెస్ట్ ర్యాంకును అంతిమంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఇక జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి. పరీక్షకు వారం ముందు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు ఫిబ్రవరి 12న విడుదలకానున్నాయి.



# సర్వీస్ రివాల్వర్ అమ్మేసిన ఎస్ఐ!

**అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు**

**అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఘటన**



**హైదరాబాద్, నవంబర్ 25:** ఇటీవల ఓ పోలీస్ నిందితుడ్ని వదిలిపెట్టేందుకు అతడి వద్ద నుంచి ఏకంగా రూ.2 కోట్లు తీసుకోవడం దుమారం రేపింది. తాజాగా మరో పోలీస్ అధికారి తన సర్వీస్ రివాల్వర్‌ను అమ్మేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటన రాష్ట్ర పోలీసు విభాగంలో తీవ్ర కలకలం సృష్టించింది. సర్వీస్ రివాల్వర్‌ను ఎక్కడైనా తాకట్టు పెట్టి ఉంటాడన్న కోణంలోనూ విచారణ జరుగుతోంది. పోలీస్ స్టేషన్ లాకర్‌లో భద్రపరచాల్సిన దొంగల నుంచి రికవరీ చేసిన బంగారంతో పాటు, ఎస్సైకి కేటాయించిన సర్వీస్ తుపాకీ (రివాల్వర్) కూడా కనిపించకుండా పోవడం గమనార్హం. ఈ వస్తువులు అదృశ్యం కావడంతో, ఉన్నతాధికారులు కేసు నమోదు చేయించి, వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సై భానుప్రకాష్ హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు పీఎస్‌లో పనిచేశాడు. ప్రస్తుతం అంబర్‌పేట్ పీఎస్ క్రైం ఎస్సైగా ఉన్నాడు. ఆ సమయంలో ఓ కేసులో రికవర్ చేసిన నాలుగు తులాల బంగారాన్ని తన డ్రాలో పెట్టాడు. కొన్ని రోజులకు అవి తీసి అమ్మేశాడు. బంగారాన్ని వాటి యజమానికి అప్పగిస్తానని చెప్పి నమ్మించి లోక్ అదాలత్‌లో కేసును క్లోజ్ చేయించాడు. కానీ వారికి ఎస్సై భాను ప్రకాష్ బంగారాన్ని తిరిగివ్వలేదు. ఉన్నతాధికారులకు విషయం తెలియడంతో అతడి మీద కేసును నమోదు చేసి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. భాను ప్రకాష్ చెక్ చేసి చూడగా అందులో సర్వీస్ రివాల్వర్ లేదని గుర్తించారు. కేవలం 9ఎంఎం బుల్లెట్లు కొన్ని ఉన్నాయని, ఇటీవల రికవరీ చేసిన బంగారం కూడా లేదని స్టేషన్ పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లగా వారి ఆదేశాలతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎస్ఐ భాను ప్రకాష్ తన వ్యక్తిగత ఆర్థిక అవసరాల కోసం ఈ వస్తువులను విక్రయించి ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో భావిస్తున్నారు. ఎస్ఐ భానుప్రకాష్ ఆర్థిక సమస్యలకు కారణంగా బెట్టింగ్ అని తెలుస్తోంది. అతడు గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులకు ప్రిపేర్ అవుతున్నానని చెప్పి తరచుగా సెలవులు తీసుకునేవాడని పోలీసులు తెలిపారు. బెట్టింగ్ లో అతడు అరకోటి రూపాయల పైగా నష్టపోయాడని, దాంతో ఆర్థిక సమస్యలు అతడ్ని వెంటాడాయి. ఈ క్రమంలో భానుప్రకాష్ ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు శాఖ ఇచ్చిన సర్వీస్ రివాల్వర్‌ను ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు విక్రయించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసుల్లో రికవరీ చేసిన బంగారాన్ని సైతం వాటి యజమానికి ఇవ్వకుండా తానే విక్రయించి సొమ్ము చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలుతున్నాయి. ఇంతకీ సర్వీస్ రివాల్వర్ ఎవరికి విక్రయించాడు అనే కోణంలో విచారణ చేపట్టారు. పోలీసు శాఖ నిబంధనలు పాటించకపోగా, రూల్స్ ఉల్లంఘిస్తూ రివాల్వర్ అమ్మేయడంపై డిపార్ట్‌మెంట్ సీరియస్‌గా ఉంది. త్వరలోనే అతడిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



# ఆటో ఫెయిర్ పెంపుపై న్యాయమైన నిర్ణయం తీసుకోవాలి

**ఆటో డ్రైవర్ల పై ఇంత కక్ష ఎందుకు..!**

**తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్**

**హైదరాబాద్, నవంబర్ 26 :** ఆటో ఫెయిర్ మీటర్ పెంపుపై తక్షణమే న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మొహమ్మద్ ఉమర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ 2014లో నిర్ణయించిన కనీస ఫెయిర్ ₹20 ఇప్పటికీ అమల్లో ఉండటాన్ని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా ఆటో ఫెయిర్‌ను పెంచకపోవడం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ 11 సంవత్సరాల కాలంలో ఆర్టీసీ బస్ ఛార్జీలు 6 సార్లు పెరిగాయని, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెరగడంతో పాటు వారికి ప్రతి సంవత్సరం డీఏ ఇస్తున్నారని, అంతేకాక ఎమ్మెల్యేల జీతాలు ఒకేసారి 300% పెంచుకున్నారని గుర్తు చేశారు. జీవన వ్యయం, నిత్యావసరాలు, కూరగాయల ధరలు భారీగా పెరిగినప్పటికీ, తమకు 2014నాటి ఛార్జీలే అమలులో ఉండటం అసంఘటిత కార్మికవర్గమైన ఆటో డ్రైవర్ల జీవన హక్కును(ఆర్టికల్21) ఉల్లంఘించడమే అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు**

ఆటో ఫెయిర్ మీటర్ పెంపుపై తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ యూనియన్ మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించింది. యూనియన్ విజ్ఞప్తికి స్పందించిన హెచ్ఆర్సీ ఆటో డ్రైవర్ల సమస్యలపై తక్షణ చర్యలు ప్రారంభించాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ వేగవంతమైన స్పందనకు యూనియన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఆటో డ్రైవర్లపై పడుతున్న భారాన్ని తగ్గించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను ఉల్లంఘించకుండా, ఫెయిర్ మీటర్ పెంపుపై తక్షణమే న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. త్వరలోనే యూనియన్ సమావేశమై తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తుందని యూనియన్ నాయకులు తెలియజేశారు.

# రాయితీలు ఇవ్వడమేంటి?

**భయాన్ని బలహీనపరుస్తున్నారు ● రాయితీలు ఇవ్వడం సరికాదు**

**ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్లపై హైకోర్టు ఆగ్రహం**





**హైదరాబాద్, నవంబర్ 25:** ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం ఈ మధ్య వాహనాల రకాన్ని బట్టి.. 75 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్న విషయం తెలిసిందే. పేరుకుపోయిన పెండింగ్ చలాన్ల బకాయిలను రికవరీ చేసుకునేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడు డిస్కౌంట్లు ఇస్తుంటుంది. ఇలా డిస్కౌంట్లు ఇవ్వడం వల్ల చట్టపరమైన పరిణామాల పట్ల ప్రజల్లో ఉన్న భయం, గౌరవం బలహీనపడతాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా.. రాయితీలు ట్రాఫిక్ క్రమశిక్షణారాహిత్యాన్ని మరింత పెంచుతాయని, ప్రజలు నిబంధనలను ఉల్లంఘించినా ఏదో ఒక దశలో రాయితీ లభిస్తుందనే భావన పెరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఈ-చలానా వ్యవస్థలో మార్పులు చేసి, ఉల్లంఘన వివరాలను స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించింది. ఇంటిగ్రేటెడ్ ఈ-చలానా వ్యవస్థను సవాల్ చేస్తూ హైదరాబాద్ తార్నాకకు చెందిన వి. రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ట్రిపుల్ రైడింగ్‌కు 1988 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం.. రూ. 100 నుంచి రూ. 300 మాత్రమే జరిమానా విధించాలి. కానీ దీనికి విరుద్ధంగా 2019 నిబంధన ప్రకారం.. రూ. 1000 విధిస్తున్నారని.. ఇది చెల్లదని వాదించారు. 2019లో సవరణ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అన్వయించుకోకపోవడంతో.. 1988 నిబంధనల ప్రకారమే చలానా జారీచేయాల్సి ఉందన్నారు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె తమ వాదనలు వినిపించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 200 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలనేవి జరిమానా విధించదగ్గ నేరాలని తెలిపారు. అందుకు సంబంధించిన జరిమానాల వివరాలను వెల్లడిస్తూ ప్రభుత్వం 2007 జీవో 54 జారీ చేసిందని హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వం జరిమానాను పెంచుతూ 2011లో ఉత్తర్వులు జారీ చేసిందని.. ప్రస్తుత చలానా వ్యవస్థలో నిబంధనలన్నీ పొందుపర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రాఫిక్ ఉల్లంఘన జరిగినప్పుడు అది ఏ చట్టంలోని ఏ సెక్షన్ కింద ఉల్లంఘనగా పరిగణించబడిందనే వివరాలను చలానా జారీ సమయంలో స్పష్టంగా పొందుపరచగలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలు, వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉందో సమగ్ర నివేదికను డిసెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు హోంశాఖను ఆదేశించింది. ఈ సాంకేతిక మెరుగుదల కేంద్ర మోటారు వాహన నిబంధన 167 ప్రకారం తప్పనిసరి అని న్యాయమూర్తి గుర్తు చేశారు.

# నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

**ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం**

**హైదరాబాద్, నవంబర్ 25:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




సంపాదకీయం

# రాజకీయ రణక్షేత్రాలుగా గ్రామాలు!

గ్రామాల్లో మళ్లీ సందడి మొదలయ్యింది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో గ్రామాలు ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా పల్లె పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలైంది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించగా, మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు దశల్లో నిర్వహించే గ్రామ పంచాయతీల పేర్లను యంత్రాంగం ఖరారు చేసింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. కాగా, దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవి పార్టీ రహితమే అయినా, పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అయితే ఇప్పటికే ఓసారి సర్కారు చేసిన హడావుడిని నమ్మి ఆశావహులు, భారీగా ఖర్చు చేసి షెడ్యూల్ రద్దు కావడంతో నిరాశ చెందారు. ఇప్పుడు మరోసారి షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. కోర్టులో కేసు ఉందని తెలిసినా సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు, ఇప్పటికే తమ ప్రయత్నాల్లో మునిగి తేలారు. ఆ మేరకు భారీగా ఖర్చు చేశారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే ఐదు వేలకు పైగా జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ బరిలో ఉండే అభ్యర్థి 2.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 50వేలు.. అలాగే ఐదు వేల లోపు జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ అభ్యర్థి 1.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 30వేలలోపు ఖర్చు చేయాలి. అయితే ఆచరణలో జరిగే ఖర్చులకు ఎన్నికల సంఘం పెట్టిన నిబంధనలకు ఎప్పుడూ పొంతన ఉండదన్న విషయం తెలిసిందే. అయితే సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గుచూపుతారు. కానీ, గతంలోనే షెడ్యూల్ జారీచేయగా, అప్పుడు చాలా మంది అభ్యర్థులు భారీగా ఖర్చు పెట్టారు. తీరా ఆ షెడ్యూల్ రద్దుకావడంతో తీవ్ర నిరాశ చెందారు. ఇక ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇది లా ఉంటే పల్లెల్లో పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ రహిత ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. గతంలో ఓ మారు నోటిఫికేషన్ విడుదల, రద్దు కావడంతో అప్పటికే సిద్దంగా ఉన్న అభ్యర్థులు మళ్లీ పోటీకి రంగం సిద్దం చేసుకున్నారు. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తరవాత నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మూడు వారాల సమయంలోనే మొత్తం ప్రక్రియ ముగియనుండంతో గ్రామాలు కేంద్రంగా రాజకీయ పార్టీలు బలాబలాలకు రంగం సిద్దం అయ్యింది. 27తో తొలి దశ ఎన్నికల ప్రక్రియ మొదలై డిసెంబర్ 17తో మూడో దశ పంచాయతీ ఎన్నికలు ముగుస్తాయి. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. అదికూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పోలింగ్ జరగనుండడంతో గ్రామాల్లో ఓట్ల వేటలో అభ్యర్థులు పడ్డారు. డిసెంబర్ 11న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ, డిసెంబర్ 17న మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో నామినేషన్ల పర్వం కూడా వెంటనే మొదలయ్యింది. సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇక మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల సంఘం నుంచి ఎన్నికల ప్రకటన ఉంటుందని తెలిసి హడావిడిగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిందని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. మరోవైపు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు కూడా పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రుణాల పంపిణీ సంపూర్ణంగా అందివ్వలేదు. మొత్తానికి చీరల పంపిణీని ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో మహిళా లోకం నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది చూడాలి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి నుంచి ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. తొలి విడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. రెండో విడతలో పోటీ చేసే వారికి షెడ్యూల్ జారీ నుంచి మొదలు పెడితే అదనంగా నాలుగైదు రోజులు కలిసి వస్తోంది. తుది విడతలో పోటీ చేసే వారికి దాదాపుగా మూడు వారాల సమయం దక్కుతోంది. ప్రచారానికి అధిక సమయం దక్కడం ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా తుది విడత అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా గ్రామాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.

# కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం

- దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు
- అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు
- 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం
- రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, నవంబర్ 26:** దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు సహా మొత్తం రూ. 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్-కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్ లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం. ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ (REPM) పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది. భారతదేశంలో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ కొత్త ప్రణాళిక భారతదేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల ఉత్పత్తికి పూర్తి దేశీయ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ప్రస్తుతం, ఈ రంగంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. ఈ నిర్ణయం భారతదేశాన్ని స్వావలంబన చేస్తుంది. గుజరాత్ యాత్రికులకు కూడా కేంద్రం శుభవార్త తెలిపింది. ఓఖా నుండి కనాలస్ రైల్వే లైన్‌ను డబుల్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 1,457 కోట్లు ఖర్చవుతుంది. 159 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్ దేవభూమి ద్వారకకు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచుతుంది. ఈ లైన్‌ను రెట్టింపు చేయడం వల్ల సరుకు రవాణా రైళ్లు వేగంగా నడపడానికి వీలు కలుగుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నాలుగు నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19,919 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఒకే రోజులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. ఇది రైల్వే, మెట్రో ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంది కేంద్రం. రేర్ ఎర్త్ పథకం దేశ సాంకేతికతకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం

- చైనా మాటలు ఎన్నటికీ లెక్కచేయం
- అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించింది
- చైనా రెచ్చగొట్టే ప్రకటన మానుకోవాలి
- చైనా ఇకనైనా తన తీరును మార్చుకోవాలి
- భవిష్యత్తులో దీనికి పరిణామాలు తప్పవు
- విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 26:** దాదాపు 5 ఏళ్ల తరువాత భారత్, చైనా మధ్య సంబంధాలు కుదట పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో మరో వివాదం మొదలైంది. అరుణాచల్ ప్రదేశ్ గురించి చైనా చేసిన రెచ్చగొట్టే ప్రకటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చైనాకు సమాధానమిస్తూ.. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో అంతర్భాగమని, విడదీయరాని భాగమని అన్నారు. చైనా చేసే ఏ ప్రకటన కూడా ఈ వాస్తవాన్ని మార్చలేదని స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఒక భారత పౌరుడిని ఏకపక్షంగా నిర్బంధించినందుకు సంబంధించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనలు చూశాం. ఆమెకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ ఉంది. షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి జపాన్‌కు తన తదుపరి ప్రయాణం చేయాల్సి ఉంది. నిర్బంధం సమస్యను చైనాతో గట్టిగా లేవనెత్తాం. అంతర్జాతీయ విమాన ప్రయాణాన్ని నియంత్రించే అనేక నిబంధనలను ఉల్లంఘించిన వారి చర్యపై చైనా అధికారులు ఇంకా మాకు క్లారిటీ ఇవ్వలేదు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. చైనా అధికారుల చర్యలు తమ దేశ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని దేశాల పౌరులకు 24 గంటల వరకు వీసా రహిత ప్రయాణానికి అనుమతిస్తుంది. బ్రిటన్‌లో నివసిస్తున్న భారత పౌరురాలు పేమా వాంగ్‌జోమ్ థోంగ్‌డోక్ నవంబర్ 21న లండన్ నుండి జపాన్‌కు వెళుతున్నారు. ఆమె మూడు గంటల పాటు నిర్ణయించిన స్టాప్ ఒక పీడకలగా మారింది. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమె పాస్‌పోర్ట్‌ను అరుణాచల్ ప్రదేశ్ ఆమె జన్మస్థలం అని రాసి ఉండటం వల్ల చట్టవిరుద్ధమని ప్రకటించారని పేర్కొన్నారు. థోంగ్‌డోక్‌తో జరిగిన సంఘటన గురించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడారు. ఆమెపై ఎలాంటి నిర్బంధ చర్యలు, నిర్బంధం లేదా వేధింపులు జరగలేదని పేర్కొన్నారు. చైనా సరిహద్దు తనిఖీ అధికారులు చట్టాలు, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. సంబంధిత వ్యక్తి యొక్క చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలను పూర్తిగా రక్షించారని తెలుసుకున్నాం" అన్నారు. థోంగ్‌డోక్‌తో చేసిన ప్రవర్తనపై భారతదేశం (అధికారిక దౌత్య నిరసన)పై చైనా మరోసారి రెచ్చగొట్టే ప్రకటన చేసింది. మావో నింగ్ అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా వాదనలను కూడా ప్రస్తావించారు. చైనా వారు జాంగ్‌నాన్ లేదా దక్షిణ టిబెట్ అని ఆ ప్రాంతాన్ని పిలుస్తామని చెప్పారు. "జాంగ్‌నాన్ చైనాలో భాగం. భారతదేశం ద్వారా చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసుకున్న అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ఎప్పుడూ గుర్తించలేదు" మరోసారి చైనా కయ్యానికి కాలు దువ్వుతోంది. అయితే చైనా తీరును భారత ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. చైనా ఇకనైనా తన తీరును మార్చుకోవాలని, భవిష్యత్తులో దీనికి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# పాకిస్తాన్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ హత్య!

**ఆఫ్ఘన్ మీడియా సంచలన ప్రకటన ● ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్**




**న్యూఢిల్లీ, నవంబర్ 26:** పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో 'రహస్యంగా' చంపేశారని అఫ్ఘాన్ మీడియా ప్రకటించింది. అయితే, పాకిస్తాన్ ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారని చెబుతోంది. ఆఫ్ఘన్ మీడియా చేసిన ప్రచారంతో రావల్పిండిలోని అడియాలా జైలు వద్ద వేలాది మంది పీటీఐ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అఫ్ఘాన్ న్యూస్ వెబ్‌సైట్ 'అఫ్ఘానిస్తాన్ టైమ్స్' మంగళవారం రాత్రి సంచలన ప్రకటన చేసింది. "పాకిస్తాన్‌లోని విశ్వసనీయ మూలాలు తెలిపిన సమాచారం ప్రకారం, పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో రహస్యంగా చంపేశారు. అతని శవాన్ని జైలు నుంచి బయటకు తరలించారు" అని ఆ వార్తలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు 'కాబుల్ ఫ్రంట్‌లైన్' వంటి ఇతర అఫ్ఘాన్ మీడియా ఔట్‌లెట్లలో కూడా విస్తృతంగా ప్రచారం అయ్యాయి. 'పాకిస్తాన్ సైన్యంలోని రహస్య వ్యక్తులు' ఇచ్చిన సమాచారం అని చెప్పుకున్నారు. కానీ ఎలాంటి ఆధారాలు లేవు. పాకిస్తాన్ అధికారులు ఈ ఆరోపణలను 'తప్పుడు వార్త'గా ఖండించారు. "ఇమ్రాన్ ఖాన్ క్షేమంగా ఉన్నాడని.. అతనికి ఎలాంటి హాని జరగలేదు. ఈ రూమర్‌లు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడానికి ఉద్దేశించినవి" అని పాకిస్తాన్ సమాచార మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించారు. అడియాలా జైలు సూపరింటెండెంట్ కూడా ఖాన్ ఆరోగ్యం బాగుందన్నారు. అతను తన ట్విట్టర్ ఖాతాను కూడా జైలు నుంచి నిర్వహిస్తున్నాడనే ఆరోపణలు తప్పు అని ఇస్లామాబాద్ కోర్టులో సోమవారం స్పష్టం చేశారు. పాకిస్తాన్ మొబైల్ ఆపరేటర్లు కూడా ఈ రూమర్‌లు 'ఫేక్ న్యూస్'గా గుర్తించి, వాటిని అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ రూమర్ వల్ల పీటీఐ కార్యక్రతలు మండిపడ్డారు. మంగళవారం అడియాలా జైలు వద్ద వేలాది మంది సమావేశమై, ఖాన్ ఆరోగ్యం గురించి సమాచారం కోరుతూ నిరసనలు చేశారు. ఖాన్ సోదరి అలీమా ఖాన్, డాక్టర్ ఉజ్మా, నూరీన్ నియాజీలు జైలు గేటు వద్ద కూర్చుని ధర్నా చేశారు. అయితే, పోలీసులు వారిని బయటకు తీసుకెళ్లారు. 3 రోజులుగా మిమ్మల్ని ఇమ్రాన్ ఖాన్‌తో కలవనీయకుండా ఆపేశారు. అతనికి ఏమైందో తెలుసుకోవాలి అని అలీమా ఖాన్ మీడియా ముందు డిమాండ్ చేశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. అవినీతి, రాష్ట్ర ద్రోహం వంటి 20కి పైగా కేసుల్లో అతనిక శిక్ష విధించారు. గత నెలలో అతను సైనిక అధిపతి అసీమ్ మునీర్‌పై తీవ్రంగా విమర్శించాడు. డెమోక్రసీని చీల్చి, 'అసీమ్ లా'ను రుద్దుతున్నారు" అని ఖాన్ పేరిట జైలు నుంచి ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ రూమర్‌ను నమ్మేవాళ్లు ఎక్కువగా ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను బయటకు చూపించాలని డిమాండ్ చేసేవారు పెరుగుతున్నారు.

# ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడి అరెస్ట్

**షోయెబ్‌ను అరెస్ట్ చేసిన ఎన్ఐఏ అధికారులు**



**న్యూఢిల్లీ, నవంబర్ 26:** నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసులో ఎన్ఐఏ మరో నిందితుడిని అరెస్టు చేసింది. దర్యాప్తు సంస్థ తెలిపిన ప్రకారం, ఈ నిందితుడు కారు పేలుడుకు ముందు ప్రధాన నిందితుడు, ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీకి సహకరించాడు. అతనికి ఆశ్రయం కల్పించడంతో పాటు అవసరమైన సహాయం అందించాడని అభియోగాలు ఉన్నాయి. ఢిల్లీలో కారు పేలుడు ఘటనలో తాజాగా అరెస్టు అయిన నిందితుడి పేరు షోయెబ్. అతడు హర్యానాలోని ఫరీదాబాద్‌లోని ధౌజ్ గ్రామానికి చెందినవాడు. రెండు వారాల కింద ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనకు ముందు వరకు నిదింతుడు షోయెబ్ ఉగ్రవాది ఉమర్‌కు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చాడు. దాంతో పాటు ఉమర్‌కు కావాల్సిన అన్ని సమకూర్చినట్లు ఎన్ఐఏ ప్రాథమిక దర్యాప్తు తేలింది. ఈ అభియోగాలతోనే నిందితుడు షోయెబ్‌ను బుధవారం నాడు ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఉగ్రవాది ఉమర్ నబీకి ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, అతనికి షోయెబ్ అన్ని రకాల లాజిస్టిక్ సపోర్ట్ కూడా అందించాడని తెలిపింది. ఇందులో వసతి, సామాగ్రి, ఇతర రకాల సహాయం ఉన్నాయి. ఈ కేసులో షోయెబ్ ఏడవ నిందితుడిగా ఉన్నాడు. ఇంతకుముందు ఉమర్ కు సంబంధించిన మరో ఆరుగురు సహచరులను అరెస్టు చేసింది. ఈ చర్య కేసు నంబర్ కింద జరిగింది. ఢిల్లీలో ఉమర్ ఆత్మాహుతి దాడికి సంబంధించిన ఆధారాలపై దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ పనిచేస్తోంది. అనేక రాష్ట్రాల్లోని స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహిస్తోంది. ఈ దాడిలో పాల్గొన్న ఇతర వ్యక్తులను గుర్తించి, అరెస్ట్ చేస్తున్నారు. ఈ ఉగ్రదాడి వెనుక ఉన్న పూర్తి కుట్రను ఛేదించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలోనే మిగతా నిందితులను, దాడికి ప్లాన్ చేసిన మాస్టర్ మైండ్.. దాడికి కారణాలు దర్యాప్తులో తేలతాయన్నారు.

# మహిళల వ్యక్తిత్వ హననాన్ని అరికట్టాలి

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. 'ఆడపిల్లల్లా ఏడవద్దు', 'గాజులు తొడుక్కున్నావా' వంటి అవమానకరమైన మాటలను సమాజం నుంచి పూర్తిగా తొలగించాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' (మాక్ అసెంబ్లీ) కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం మొదటి నుంచి కట్టుబడి ఉందని గుర్తుచేశారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారని అన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా సంఘాలను స్థాపించి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశానని, విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వారి ప్రగతికి తోడ్పడ్డానని వివరించారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మన పౌరులకు అందించిన గొప్ప ఆయుధమని చంద్రబాబు కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఎన్నో అద్భుతాలు సాధ్యమయ్యాయన్నారు. "ఒకప్పుడు ఛాయ్ అమ్ముకున్న వ్యక్తి (నరేంద్ర మోదీ) ఈ దేశానికి ప్రధాని అయి దేశ దశ, దిశను మారుస్తున్నారంటే అది మన రాజ్యాంగం గొప్పతనమే. సాధారణ కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, భారతరత్నగా ఎదిగారు. గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి అయ్యారు. అలాగే, ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన నేను నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యానంటే అది కూడా రాజ్యాంగం ఇచ్చిన అవకాశమే" అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా ఇచ్చిందని, కొందరు హక్కుల కోసం పోరాడతారు కానీ బాధ్యతలను విస్మరిస్తారని అన్నారు. శాసనసభ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని, చట్టసభలకు వ్యక్తిగత కక్షల కోసం కాకుండా ప్రజాహితం కోసం రావాలని సూచించారు. మంచి, చెడులను విశ్లేషించుకునే శక్తి విద్యార్థులకు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. సంక్షోభాలను చూసి భయపడకుండా వాటిని అవకాశాలుగా మార్చుకున్నప్పుడే విజయం సాధ్యమవుతుందని అన్నారు. తాను చిన్నప్పుడు లాంతరు వెలుగులో చదువుకుని, 1999లోనే విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చానని, ఇప్పుడు సొంతంగా ఇంటిపైనే కరెంటు ఉత్పత్తి చేసుకునే స్థాయికి చేరుకున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో విలువలు పెంపొందించాలనే లక్ష్యంతోనే చాగంటి కోటేశ్వరరావు వంటి వారిని నియమించామని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, త్వరలోనే అగ్రగామిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' లక్ష్యాలను కలిసికట్టుగా సాధిద్దామని పిలుపునిచ్చారు. "మా ఎమ్మెల్యేలు కొన్నిసార్లు తడబడతారు. కానీ, మీరు మాత్రం ఏమాత్రం తడబడకుండా ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడారు. మీ ప్రతిభ అభినందనీయం" అని అన్నారు. బాధ్యత, చైతన్యం పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. "28 ఏళ్లకే నేను ఎమ్మెల్యే అయ్యాను. లెక్చరర్ ఉద్యోగంలో చేరమని మా వైస్ ఛాన్సలర్ అడిగితే, నేను ఎమ్మెల్యే అవుతానని చెప్పి 1978లో గెలిచి చూపించాను" అని తెలిపారు. నిరంతర శ్రమ, సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కోవడం వల్లే తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, చిన్న వయసులోనే మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఎదిగానని వివరించారు. రాజ్యాంగం దేశానికి ఆత్మలాంటిదని చంద్రబాబు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందుచూపుతో అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. "రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసేవారు మంచివారు కాకపోతే చెడు ఫలితాలు వస్తాయి. అమలు చేసేవారు మంచివారైతే చెడు రాజ్యాంగమైనా మంచి ఫలితాలను ఇస్తుంది" అని అంబేద్కర్ చెప్పిన మాటలను ఆయన గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఒక వజ్రాయుధమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. చట్టాలు చేయడం ముఖ్యం కాదు, వాటిని పాటించడమే అత్యంత ప్రధానం. ప్రతిపక్షం లేవనెత్తిన సమస్యలకు ప్రభుత్వం నిర్మాణాత్మకంగా పరిష్కారం చూపినప్పుడే అది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.



ఈ స్ఫూర్తిని చాటుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. రాజ్యాంగ విలువలు, చట్టసభల కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వినూత్న ఆలోచనకు ఇది రూపం దాల్చింది. నిజమైన అసెంబ్లీని తలపించేలా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ వాగ్ధాటితో, విషయ పరిజ్ఞానంతో అందరినీ ఆకట్టుకున్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 175 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రిగా ఎం. లీలా గౌతమ్, ప్రతిపక్ష నేతగా సౌమ్య, ఉపముఖ్యమంత్రిగా కోడి యోగి, విద్యాశాఖ మంత్రిగా చిన్మయి, స్పీకర్‌గా స్వాతి వ్యవహరించారు. సభాపతి ఎన్నిక నుంచి బిల్లుల ఆమోదం వరకు అన్ని ప్రక్రియలను విద్యార్థులే స్వయంగా నిర్వహించారు. అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు, సమస్యలపై చర్చలతో సభా కార్యక్రమాలు హోరాహోరీగా సాగాయి. ముందుగా ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో సభ ప్రారంభమైంది. జాతీయ గీతాలాపన అనంతరం స్పీకర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కోడూరు ఎమ్మెల్యేగా ఉన్న విద్యార్థి కే. లోకేశ్వర్ రెడ్డి.. కుమారి స్వాతి పేరును స్పీకర్ పదవికి ప్రతిపాదించగా, మరో సభ్యుడు బి. అనిల్ కుమార్ బలపరిచారు. స్వాతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించగానే, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆమెను గౌరవంగా స్పీకర్ కుర్చీ వద్దకు తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్పీకర్ అధికార, ప్రతిపక్షాలకు సమానమని, సభా నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతిపక్ష నేత స్పందిస్తూ.. "ప్రభుత్వం మెజారిటీతో మా గొంతు నొక్కాలని చూస్తే, మీరే మాకు రక్షణగా నిలవాలి" అని కోరారు. దీనికి స్పీకర్ బదులిస్తూ.. "ఈ కుర్చీకి కుడి, ఎడమలు ఉండవు. కేవలం రాజ్యాంగం, సభా నియమాలు మాత్రమే ఉంటాయి. ప్రతిపక్షానికి తగిన సమయం ఇస్తాను. సభా గౌరవాన్ని కాపాడటం మనందరి బాధ్యత" అని స్పష్టం చేశారు. స్పీకర్ ఎన్నిక తర్వాత ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ నిర్వహించారు. వ్యవసాయం, విద్య, హోం, క్రీడలు, పట్టణాభివృద్ధి వంటి పలు శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులుగా ఉన్న విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యంగా, విద్యార్థుల్లో మొబైల్ వ్యసనంపై ఈ ఏడాది ఎన్ని కేసులు నమోదయ్యాయనే ప్రశ్నకు, వందల్లో కేసులు నమోదయ్యాయని విద్యాశాఖ మంత్రి తెలిపారు. బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని, డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు పరిశీలనలో ఉందని చెప్పారు. అయితే, మంత్రి సమాధానంపై ప్రతిపక్ష సభ్యుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు లేవు. మీరు పైలట్ సెంటర్లు తెరిచేలోగా విద్యార్థుల భవిష్యత్తు స్విచ్ ఆఫ్ అయిపోతుంది" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. మంత్రి స్పందిస్తూ, "మేం విద్యార్థులను బాధితులుగా చూస్తున్నాం, మీరు అల్లరి మీద దృష్టిపెట్టారు" అంటూ బదులిచ్చారు. అనంతరం సభలో 'ఆంధ్రప్రదేశ్ పిల్లల ఆన్‌లైన్ భద్రత–సోషల్ మీడియా నియంత్రణ బిల్లు–2025', 'ఆంధ్రప్రదేశ్ విద్యార్థి పర్యావరణ పరిరక్షణ చట్టం–2025' అనే రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. పర్యావరణ పరిరక్షణ బిల్లుపై ప్రతిపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలనే నిబంధన పిల్లలపై భారం మోపడమేనని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. స్పీకర్ ఎంతగా విజ్ఞప్తి చేసినా వారు వెనక్కి తగ్గకపోవడంతో మార్షల్స్‌ను పిలవాల్సి వచ్చింది. మార్షల్స్ రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న సభ్యులను సభ నుంచి బయటకు పంపించారు. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా రెండు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. మాక్ అసెంబ్లీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు హాజరయ్యారు. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'భారత రాజ్యాంగం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. మంత్రి నారా లోకేశ్ స్వయంగా విద్యార్థులకు శాసనసభ, శాసనమండలి హాళ్లను చూపించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. వారితో కలిసి భోజనం చేసి, ఫోటోలు దిగి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియపై మరుపురాని అనుభూతిని అందించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులతో కలిసి 'కాన్సిటిట్యూషన్ ఆఫ్ ఇండియా ఫర్ చిల్డ్రన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలపై హక్కును వదులుకునే ప్రశ్నే లేదు

కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జలాల కేటాయింపులపై ట్రిబ్యునల్ చేపట్టిన పునఃసమీక్షను అంగీకరించబోమని ఆయన తేల్చిచెప్పారు. అమరావతిలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కేంద్రం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అయితే, వరదల సమయంలో వచ్చే నీటిని మాత్రం సామరస్యపూర్వక వాతావరణంలో పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.



# గిరిజన ప్రాంతాల్లో మార్పు గాలి!

**సమయం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్ :** సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్ల ప్రకటన తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో అపూర్వ ఘట్టంగా నిలిచింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వంద శాతం స్థానాలను ఎస్టీలకు కేటాయించడం గిరిజన సమాజానికి రాజ్యాంగబద్ధమైన హక్కును కట్టబెట్టింది. ఈ చారిత్రక పరిణామం నేపథ్యంలోనే, ఆదిలాబాద్ జిల్లా పులిమడుగు సర్పంచ్ అభ్యర్థి సుజాత చుహాన్ వంటి యువ మహిళా నేతలు తమ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలుస్తున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు అమలు చేసిన ఈ విధానం వల్ల భద్రాద్రి కొత్తగూడెం (460), ఆదిలాబాద్ (312) వంటి జిల్లాల్లో ఎస్టీ నాయకత్వం గ్రామ స్వరాజ్యం యొక్క స్వరూపాన్ని సమూలంగా మార్చనుంది. ఓవరాల్‌గా ఎస్టీలకు దక్కిన 3,201 స్థానాలు అణగారిన వర్గాల భాగస్వామ్యం పట్ల ప్రభుత్వ నిబద్ధతను మరోసారి నిరూపించాయి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిచ్చాయి.

### ప్రజాస్వామ్య వేదికపై స్త్రీ శక్తి పతాకం..

అయితే, ఈ రిజర్వేషన్ల ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశం మహిళా సాధికారతకు దక్కిన సముచిత స్థానం. 50 శాతం కోటా నిబంధనను కచ్చితంగా అమలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది సర్పంచ్ పీఠాలు మహిళల పాలనలోకి వచ్చాయి. ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ అనే భేదం లేకుండా సగం స్థానాలు మహిళలకే దక్కడం, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పటిష్ఠం చేసింది. నల్గొండ (404 స్థానాలు), ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో మహిళా రిజర్వేషన్లు భారీగా పెరగడం, స్థానిక సంస్థల్లో మహిళల నిర్ణయాధికార శక్తి ఎంత మేరకు ఉందో ప్రతిఫలించింది. మహిళా నాయకత్వం గ్రామాలలో సమగ్ర వికాసానికి నాంది పలుకుతుందనడంలో సందేహం లేదు.

### రిజర్వేషన్ల ఖరారు తీరు..

రిజర్వేషన్ల ఖరారులో అనుమానాలకు తావులేకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించారు. 50% పరిమితికి లోబడి, అన్ని సామాజిక వర్గాలకు నిర్దిష్ట వాటాలు కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లా కైలాసనగర్‌లో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లక్కీ డ్రా, వీడియో చిత్రీకరణ ద్వారా మహిళా రిజర్వేషన్లను ఖరారు చేయడం ప్రజాస్వామ్యయుతంగా జరిగింది. 473 గ్రామ పంచాయతీల్లో 213 స్థానాలను మహిళలకు కేటాయించడంలో చూపిన ఈ పారదర్శక విధానం సామాజిక న్యాయానికి ఊతమిచ్చింది. సామాజిక వర్గాలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన స్థానాలను అందించడంలో అధికార యంత్రాంగం సమర్థతను ప్రదర్శించింది.

### నారీశక్తికి ప్రతీక సుజాత..

మహిళా రాజకీయ విప్లవానికి, గిరిజన సాధికారతకు తార్కాణంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థి సుజాత చుహాన్ నిలుస్తున్నారు. మహిళలకు రిజర్వ్ అయిన ఈ స్థానం ద్వారా, తన ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఆమె సాహసోపేతంగా బరిలోకి దిగారు. ప్రభుత్వ నిధుల కొరత, స్థానిక సమస్యలు తీవ్రంగా ఉన్నా, వాటిని పట్టుదలతో పరిష్కరించేందుకు సుజాత వంటి యువ, మహిళా నాయకత్వం ముందుకు రావడం ఆదర్శనీయం. పులిమడుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా సుజాతకు ఉందని, గ్రామస్థులు బలంగా విశ్వసిస్తున్నారు. స్థానిక పాలనా పగ్గాలు సుజాత వంటి మహిళా శక్తి చేతుల్లోకి రావడమంటే, అది కేవలం పాలన కాదు, సమగ్ర వికాసానికి, సమర్థతకు తొలి అడుగు.

# ప్రధానమంత్రి నుంచి రాష్ట్రపతి వరకు ప్రశంసలు

ఫిరోజ్‌ఖాన్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9640466464

ఒకప్పుడు వెనుకబాటుకు చిరునామా. నేడు, దేశ పాలనా వ్యవస్థకే దిక్సూచి. అసాధ్యమనే మాటను చెరిపేసి, దృఢ సంకల్పంతో అద్భుతాలు సృష్టించిన స్ఫూర్తిగాథ ఇది. కేంద్ర ప్రభుత్వ నివేదికల నుంచి దేశ అత్యున్నత పీఠాల వరకు.. ఆదిలాబాద్ జిల్లా సాధించిన ప్రగతి నేడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డును, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'ఎక్సలెన్స్' పురస్కారాన్ని అందుకున్న జిల్లా ప్రస్థానం.. నిబద్ధత గల నాయకత్వం, చురుకైన ప్రజా భాగస్వామ్యం కలిస్తే ఏ ప్రాంతం అయినా అగ్రస్థానంలో నిలవగలదని నిరూపించింది. ఐఐటీ ఇంజనీరింగ్ విశ్లేషణాత్మకతను పాలనలో మేళవించిన కలెక్టర్ రాజర్షి షా, ప్రభుత్వ యంత్రాంగాన్ని పారదర్శకత, జవాబుదారీతనంతో నడిపి, ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, ప్రతి సంక్షేమ ఫలాన్ని చివరి వ్యక్తికీ చేర్చడంలో ఆయన చూపిన చిత్తశుద్ధి నిజంగా దేశానికే ఆదర్శం. ఆయన మార్గదర్శకత్వంలో ఆవిష్కృతమైన ఈ "ఆదిలాబాద్ మోడల్".. భారతదేశం సాధించబోయే సమగ్ర అభివృద్ధికి శక్తివంతమైన స్వర్ణమానకంగా నిలుస్తోంది.

### రాష్ట్రపతి చేతుల మీదుగా 'జల సంకల్పం' పురస్కారం..

ఆదిలాబాద్ విజయాల పరంపరలో అత్యంత కీలకమైంది 'జల సంకల్పం'. ఐఐటీ కాన్పూర్ నుండి ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్న కలెక్టర్ షా, నీటి సంరక్షణ ప్రయత్నాలను వైజ్ఞానిక పద్ధతిలో చేపట్టి, 98,693 పనులను జియో-ట్యాగింగ్ ద్వారా పక్కా పారదర్శకతతో పర్యవేక్షించారు. ఈ కృషి ఫలితంగానే, కేంద్ర జలశక్తి శాఖ 'జల్ సంచయ్.. జన్ భాగీదారీ' విభాగంలో దక్షిణ భారతంలో జిల్లా మొదటి స్థానం సాధించి, గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా ₹2 కోట్ల పురస్కారాన్ని అందుకుంది. ఈ విజయం.. పారదర్శకత, సాంకేతికత కలగలిస్తే, సుస్థిర వ్యవసాయానికి పునాది వేయవచ్చని నిరూపించింది.

### ప్రధానమంత్రి ప్రశంసలు అందుకున్న ఆకాంక్షా బ్లాక్!

ఆదిలాబాద్ మార్పునకు నార్నూర్ ఆకాంక్షా బ్లాక్ ఒక ఉదాహరణ. అత్యంత వెనుకబడిన ఈ గిరిజన ప్రాంతం, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, అధికారుల నిబద్ధత కారణంగా కేవలం రెండేళ్లలో దేశానికే ఆదర్శంగా ఎదిగింది. నార్నూర్ ఆకాంక్షా బ్లాక్ ప్రోగ్రామ్‌లో టాప్ 5లో స్థానం దక్కించుకొని, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా 'ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అవార్డు 2024'ను కైవసం చేసుకుంది. 100% సురక్షిత ప్రసవాలు, రక్తహీనతను సున్నాకు తగ్గించడం వంటి సామాజిక విజయాలు మోడల్ సొంతం. 'నార్నూర్ మానిటరింగ్ యాప్' ద్వారా నిజ-సమయ పర్యవేక్షణ ఈ విజయాన్ని సాధ్యం చేసింది. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా చేరతాయని ఈ మోడల్ దేశానికి చాటి చెప్పింది.

### గవర్నర్ చేతుల మీదుగా గౌరవం..

ఆదిలాబాద్ జిల్లా సాధించిన మరో వినూత్న విజయం 'ఆరోగ్య పాఠశాల'. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఆరోగ్య సూత్రాలు తెలిసిన 'ఆరోగ్య రాయబారులుగా' తీర్చిదిద్దడం జరిగింది. ఈ వినూత్న ఆరోగ్య-విద్యా సమన్వయానికి ప్రతిష్టాత్మకమైన స్కోచ్ గవర్నెన్స్ అవార్డు లభించింది. అంతేకాకుండా, రాష్ట్ర గవర్నర్ గారి చేతుల మీదుగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డును అందుకోవడం, మండల స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రజావాణి వ్యవస్థను వికేంద్రీకరించడం వంటి చర్యలు పాలనలో కలెక్టర్ షా చూపిన పారదర్శకత, నైతిక విలువలకు నిదర్శనం. సంపూర్ణత అభియాన్‌లో గోల్డ్ మెడల్ అందుకున్న తెలంగాణలోని ఏకైక బ్లాక్‌గా నార్నూర్ నిలవడంతో మళ్లీ గవర్నర్ గారి నుంచి గౌరవం దక్కింది.

### 'రాజర్షి షా మోడల్'.. విజయానికి చిరునామా!

ఆదిలాబాద్ జిల్లాకు ఏడాది కాలంలో ఏడు జాతీయ పురస్కారాలు లభించడం ఒక అద్భుతం. ఈ విజయాల పరంపర కేవలం అవార్డుల లెక్క కాదుబీ ఇది ఒక దార్శనిక నాయకత్వం – కలెక్టర్ రాజర్షి షా – ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని, వ్యవస్థాపరమైన మార్పులను తీసుకొచ్చి, అధికారులను, ప్రజలను ఏకతాటిపైకి నడిపిన తీరును ప్రతిబింబిస్తుంది. ఆయన కృషికి ప్రధానమంత్రి నుంచి రాష్ట్రపతి వరకు అభినందనలు లభించాయి. ఆదిలాబాద్ నేడు దేశంలోని ఇతర జిల్లాలకు, ముఖ్యంగా ఆకాంక్షా జిల్లాలకు ఒక శక్తివంతమైన మోడల్‌గా నిలిచింది. నిబద్ధత, నిష్కపటత్వం, ఇంజనీరింగ్ మేధస్సు కలగలిసిన పాలనతో.. ఏ ప్రాంతం యొక్క విధిని అయినా అద్భుతంగా తిరగరాయవచ్చని ఈ 'అడవుల జిల్లా' నిరూపించింది. ప్రతి అధికారికి ఆత్మవిశ్వాసాన్ని నింపి, పాత పద్ధతులను పక్కన పెట్టి, ప్రజల భాగస్వామ్యాన్ని





పెంపొందించడంలో ఆయన చూపిన స్ఫూర్తి అనిర్వచనీయం. సవాళ్లను అవకాశాలుగా మలిచి, అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలనే ఆయన సంకల్పమే ఈ విజయ రహస్యం. ఆదిలాబాద్ నేడు కేవలం ఒక జిల్లా కాదుబీ ఇది నిశ్శబ్దంగా దేశవ్యాప్తంగా పరివర్తనను ప్రేరేపిస్తున్న ఒక ఉద్యమం. ఆదిలాబాద్ నుంచి మొదలైన ఈ నూతన పాలనా విప్లవం.. భారతదేశ భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శనం చేస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు

# ‘బడే భాయ్’ ప్రభావం!



## రాజకీయాలపై పెను దుమారం!?



**సమయం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేసిన హఠాత్ పర్యటన, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేవలం ఎనిమిది నిమిషాల వ్యవధి కోసం హాజరై రావడం రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర చర్చకు తెర తీసింది. గతంలో ఆయన కేంద్ర మంత్రులను ఉద్దేశించి చేసిన ‘బడే భాయ్’ వంటి వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటే, ఆకస్మిక పర్యటన కేవలం ఒక రాజ్యాంగ కార్యక్రమం కాదని, కేంద్రంలోని పాలకులకు, కీలక అధికార వర్గాలకు ముఖ్యమంత్రి పంపుతున్న ఒక పరోక్ష సంకేతంగా విశ్లేషించవచ్చు. అత్యవసరమైన రాష్ట్ర కార్యక్రమాలను పక్కన పెట్టి, లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి చేసిన ప్రయాణం కేవలం రాజ్యాంగ పదవికి గౌరవం ఇవ్వడానికి మాత్రమేనా? ముఖ్యమంత్రులు తప్పనిసరిగా హాజరు కావాల్సిన ‘ప్రొటోకాల్’ లేకపోయినా, హడావుడి వెనుక బీజేపీ అధిష్ఠానంతో సాన్నిహిత్యాన్ని బలోపేతం చేసుకునే వ్యూహాత్మక కారణం దాగి ఉందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కాంగ్రెస్ అధిష్ఠానం మొత్తం కార్యక్రమాన్ని బహిష్కరించి, వ్యతిరేకతను ప్రదర్శించిన వేళ, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం కేంద్రంతో తన ప్రత్యేక బంధాన్ని చాటుతున్నట్టు స్పష్టమవుతోంది.

### అధిష్ఠానానికి సవాల్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యను కేవలం ఒక సాధారణ ప్రయాణంగా చూడలేం. ఇది కాంగ్రెస్ పార్టీ జాతీయ వైఖరికి పూర్తి విరుద్ధంగా ఉండటం వల్ల, పార్టీలో అంతర్గత సమీకరణాలపై దీని ప్రభావం ఘాటుగా పడనుంది. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి కీలక నేతలు దూరంగా ఉన్న సమయంలో, ముఖ్యమంత్రి వెళ్లి వేదికపై కూర్చోవడం అనేది అధిష్ఠానానికి ఒక సవాలుగా పరిగణించవచ్చు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రిగా తన వ్యక్తిగత నిర్ణయాధికారాన్ని చాటుకోవడానికా, లేక తన సొంత రాజకీయ భవిష్యత్తు కోసం ఢిల్లీలోని అధికార వర్గాల సాన్నిహిత్యాన్ని పెంచుకోవడానికా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ముఖ్యమంత్రి వైఖరి ఇతర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో నెలకొన్న హైకమాండ్‌కు వ్యతిరేక వాతావరణాన్ని మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషణ. ఇది కాంగ్రెస్ హైకమాండ్ బలహీనతను పరోక్షంగా బయటపెట్టిన పరిణామం.

### బీజేపీ సాన్నిహిత్యం కోసమేనా?

పర్యటన వెనుక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానంతో ముఖ్యమంత్రికి ఉన్న ‘సాన్నిహిత్యం’ అనే కోణం తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. గతంలో అనేక సందర్భాలలో కేంద్ర మంత్రులను కలవడం, ‘బడే భాయ్’ వంటి వ్యాఖ్యలు చేయడం, చివరకు కీలకమైన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ మద్దతు ముఖ్యమంత్రికి లభించిందనే విశ్లేషణ పార్టీ మార్పుపై తీవ్ర అనుమానాలకు దారితీసింది. తాజా ప్రమాణ స్వీకార కార్యక్రమం, అధికార పక్ష నేతలు అత్యధికంగా హాజరైన వేదిక కావడం వల్ల, ముఖ్యమంత్రి తన విశ్వసనీయతను, రాజకీయ బంధాన్ని కేంద్ర ప్రభుత్వ పెద్దల కళ్ళల్లో పడేలా పునరుద్ధరించుకునే ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తోంది. ఇది కేవలం బీజేపీకి ‘దగ్గర’ అయ్యే సంకేతంగా మాత్రమే కాక, తన సొంత పార్టీకి దూరమవుతున్నారనే సందేశాన్ని ఇస్తున్నట్లుగా గమనించాలి. రాష్ట్ర ప్రయోజనాల ముసుగులో నడుస్తున్న వ్యక్తిగత వ్యూహం పార్టీలో అంతర్గత దహనానికి కారణమవుతోంది.

### కేసుల భయమే కారణమా?

అంతకంటే ముఖ్యంగా, ఆకస్మిక పర్యటనకు న్యాయపరమైన చిక్కులు ముడిపడి ఉన్నాయనే కోణం విస్మరించలేనిది. ముఖ్యమంత్రిపై కీలకమైన ‘ఓటుకు నోటు’ కేసు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉండటం, గతంలో ఆయన న్యాయవ్యవస్థపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ప్రయాణం యొక్క ఉద్దేశాన్ని మరింత అనుమానాస్పదం చేస్తున్నాయి. రాజకీయ నాయకులు న్యాయమూర్తులను కలవకుండా దూరంగా ఉండటం ఒక సున్నితమైన సాంప్రదాయం. అలాంటిది, ప్రమాణ స్వీకారానికి హాజరు కావడం ద్వారా న్యాయవ్యవస్థతో సఖ్యతను, సానుకూల వాతావరణాన్ని ఏర్పరచుకోవాలనే ప్రయత్నం ముఖ్యమంత్రి చేసినట్టు స్పష్టమవుతోంది. చట్టబద్ధమైన పోరాటంలో ఉన్న ఒక నాయకుడు, ప్రజా ప్రయోజనం కంటే వ్యక్తిగత, న్యాయపరమైన ప్రయోజనాల కోసం అత్యున్నత న్యాయమూర్తి వేదికపై కనిపించడాన్ని విశ్లేషణాత్మకంగా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఇది రాజకీయ అనైతికతకు నిదర్శనం.

### రాజకీయ గమనంపై అనుమానాలు..

కేవలం ఎనిమిది నిమిషాల పర్యటనగా కొట్టిపారేయలేని సంఘటన, తెలంగాణ ముఖ్యమంత్రి రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చను రేకెత్తించింది. ఇది కాంగ్రెస్ అధిష్ఠానం పట్ల అసంతృప్తిని, బీజేపీతో వ్యూహాత్మక పొత్తును, న్యాయపరమైన ఇబ్బందుల నుండి ఉపశమనం పొందాలనే ఆకాంక్షను ఏకకాలంలో సూచిస్తుంది. పార్టీ సిద్ధాంతాలను, జాతీయ వైఖరిని పక్కన పెట్టి, ప్రత్యేకంగా ఢిల్లీకి ప్రయాణించడం, ముఖ్యమంత్రి యొక్క రాజీ ధోరణిని, అవకాశవాద రాజకీయాలను సూచిస్తోంది. ఈ చర్యలు కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్‌లో మరింత అనుమానాలకు, చీలికలకు దారి తీస్తాయనడంలో సందేహం లేదు. రేవంత్ రెడ్డి గారి ‘నడవడిక’ ఆయన రాజకీయ గమ్యాన్ని ఎటువైపు నడిపిస్తుందో కాలమే నిర్ణయించనుంది, కానీ ఈ ఎనిమిది నిమిషాలు మాత్రం తెలుగు రాజకీయ చరిత్రలో ఒక కీలకమైన ‘టర్నింగ్ పాయింట్’గా మిగిలిపోతాయి.

# జనాభా నియంత్రణకు శిక్షా?



**సమయం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్ :** నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం కార్యాచరణ పత్రం (రోడ్ మ్యాప్) సిద్ధం చేస్తున్న తరుణంలో, దేశమంతటా ఒకే ఒక్క ప్రశ్న తీవ్ర చర్చనీయాంశమవుతోంది: జనాభా నియంత్రణకు శిక్షా? దశాబ్దాలుగా జాతీయ లక్ష్యంగా భావించి, కుటుంబ నియంత్రణ పథకాలను కట్టుదిట్టంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు, ఇప్పుడు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం అంచున నిలబడ్డాయి. అధిక జనాభా వృద్ధి ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు తక్కువ సీట్లు దక్కడం అనేది రాజ్యాంగబద్ధమైన అన్యాయం. ఇది సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా వాదిస్తున్నాయి. ఈ అంశంపై కేంద్రం తీసుకునే నిర్ణయమే భవిష్యత్ భారత రాజకీయాల దిశను, సమానత్వ విలువను నిర్ణయించనుంది.

### 2026 తర్వాత సవాల్..

నియోజకవర్గాల సంఖ్యను పెంచకుండా నిలిపివేయడానికి (స్తంభింపజేయడానికి) కారణం ఇదే. 84వ రాజ్యాంగ సవరణ ద్వారా, 2026 తర్వాత జరిగే తొలి జనగణన వరకు సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నిరోధించారు. జనాభా నియంత్రణలో వెనుకబడిన రాష్ట్రాలకు శిక్ష పడకుండా, వాటికి సరిగా ప్రాతినిధ్యం కల్పించడానికే ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు, గడువు ముగిసిన నేపథ్యంలో 2027 జనగణన లెక్కల ఆధారంగానే పునర్విభజన ప్రక్రియ మొదలవుతుంది. ఇది కేవలం గణాంక సర్దుబాటు కాదు, దశాబ్దాల తరబడి చేసిన సామాజిక కృషికి గుర్తింపు దక్కుతుందా లేదా అనే ప్రశ్నను ముందుంచుతోంది.

### దక్షిణాది అన్యాయం..

ప్రజాస్వామ్య వ్యవస్థలో సీట్ల కేటాయింపు జనాభాపై ఆధారపడి ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, కొత్తగా పెరిగే సీట్లు సహజంగానే అధిక జనాభా ఉన్న ఉత్తరాదికి బదిలీ అవుతాయి. ఫలితంగా, జాతీయ విధానాలను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటు, అసెంబ్లీ ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. ఇది సమాఖ్య వ్యవస్థకు, జనాభా నియంత్రణ అనే జాతీయ లక్ష్యానికి విరుద్ధంగా ఉంటుంది. ఇది ‘శిక్ష’ గా దక్షిణాది భావించడం సమంజసమే. తెలంగాణ విషయంలో పునర్విభజన మరింత సంక్లిష్టంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014, సెక్షన్ 26 ప్రకారం, తెలంగాణలో అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ చట్టపరమైన హామీని అమలు చేయాలంటే, రాజ్యాంగ సవరణ అవసరం. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగి, దాని ప్రకారం అసెంబ్లీ స్థానాలను లెక్కిస్తే (ఉదాహరణకు 175 సీట్లకు చేరితే), పునర్విభజన చట్టంలోని 153 సీట్ల సంఖ్యను మార్చాల్సి వస్తుంది. ఈ సందిగ్ధతను కేంద్రం పరిష్కరించాల్సి ఉంది.

### కమిషన్ ముందున్న చిక్కులు..

పునర్విభజన కోసం ఏర్పడే జాతీయ కమిషన్ ముందున్న ప్రధాన చిక్కు జనాభా లెక్కల వాడకం. గతంలో 1971 జనాభా ప్రాతిపదికన సీట్లను కేటాయించారు. ఇప్పుడు 2027 లెక్కలను ఉపయోగిస్తే, అది పెద్ద ఎత్తున రాజకీయ మార్పులకు దారితీస్తుంది. కమిషన్ కేవలం జనాభానే కాదు, భౌగోళిక ప్రాంతం, పరిపాలనా సౌలభ్యం, సమాచార సౌకర్యాలు వంటి శాస్త్రీయ పద్ధతులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. జనాభా నియంత్రణలో సాధించిన పురోగతిని గుర్తించే విధంగా, ప్రత్యేక నిబంధనలను రూపొందించడం ద్వారానే ఈ చిక్కుముడిని విప్పగలం. కేంద్రం లోక్‌సభ స్థానాల సంఖ్యను కూడా పెంచాలని భావిస్తోంది. ఉదాహరణకు, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 23 లేదా 25కు పెరిగితే, ఒక్కో లోక్‌సభ పరిధిలో 7 నుంచి 9 అసెంబ్లీ స్థానాలు ఉండే నియమం ప్రకారం, రాష్ట్ర అసెంబ్లీ స్థానాల సంఖ్య 161 లేదా 175కు చేరుకునే అవకాశం ఉంది. ఈ సంఖ్యలు పునర్విభజన చట్టంలో పేర్కొన్న 153ను మించిపోతాయి. దీనికి అనుగుణంగా చట్టంలో మార్పులు చేయడం, అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం కోరడం రాజకీయంగా అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ.

### నిష్పత్తి కొనసాగింపు అవసరం..

దక్షిణాది ఆందోళనను పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల వారీ నిష్పత్తిని కొనసాగించడం ఉత్తమ పరిష్కార మార్గమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జనాభా పెరిగినా, సీట్ల సంఖ్యను పెంచినా, రాష్ట్రాల మధ్య నిష్పత్తిని కాపాడగలిగితే, జనాభా నియంత్రణకు శిక్ష పడకుండా ఆపవచ్చు. అప్పుడే, సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం విజయానికి మరో రాష్ట్రం నష్టపోవడం అనే భావన తొలగి, జాతీయ సమగ్రత బలోపేతం అవుతుంది. నియోజకవర్గాల పునర్విభజన కేవలం సాంకేతిక అంశం కాదు, ఇది భవిష్యత్తు భారత రాజకీయాల, సామాజిక సమానత్వం యొక్క దిశానిర్దేశం. 2026 తర్వాత చేపట్టబోయే పునర్విభజన ప్రక్రియ సమానత్వం, సమాఖ్య న్యాయం, జనాభా నియంత్రణ అనే మూడు అంశాల మధ్య సమతుల్యత సాధించాలి. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, జాతీయ ఏకాభిప్రాయంతో ముందుకు సాగితేనే, ఈ కీలక ప్రక్రియ విజయవంతమై, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం అవుతుంది.




# ప్రభుత్వ శాఖలో రహస్యాలు ఎందుకు?!

**సమయం ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ :** ప్రజల ఆరోగ్యం, ఆహార భద్రత వంటి కీలక అంశాలను పర్యవేక్షించే ప్రభుత్వ శాఖలో రహస్యాలు ఎందుకు దాచాలి. ఆదిలాబాద్ ఆహార భద్రతా అధికారి విలేకరులను “మా పై అధికారులు నువ్వా”, “నీకెందుకు సమాచారం ఇవ్వాలి” అంటూ తీవ్రంగా నిరాకరించడం, బెదిరింపు ధోరణి ప్రదర్శించడం ప్రభుత్వ పారదర్శకత సిద్ధాంతాన్ని పూర్తిగా ధిక్కరించడమే. జవాబుదారీతనం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాథమిక సూత్రం. సమాచార హక్కు చట్టాన్ని కూడా ధిక్కరిస్తూ, గోప్యత పేరుతో నిజాన్ని దాచిపెట్టడానికి ప్రయత్నించడం వెనుక, కచ్చితంగా ఏదో తీవ్రమైన లోపాలు దాగి ఉన్నాయనే అనుమానం బలపడుతుంది. ఒక ప్రజా సేవకురాలు అత్యంత కీలకమైన ఆరోగ్య శాఖలో ఇలా వ్యవహరించడం, శాఖలో జరుగుతున్న అక్రమాలు, విధి నిర్వహణ వైఫల్యాలపై ఉన్నత స్థాయి అనుమానాలకు తావిస్తున్నది.

### తనిఖీదారు వైఖరిపై తీవ్ర విమర్శలు..

ఆదిలాబాద్ ఆహార భద్రతా శాఖాధికారిణి “మా సిబ్బందే సహకరించడం లేదు” అంటూ వ్యక్తం చేస్తున్న ఆవేదన కేవలం నిస్సహాయత నాటకమా, లేక విధి నిర్వహణలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమా అనే సందేహం కలుగుతున్నది. ఎందుకంటే, ఆహార భద్రతా అధికారి అనేది కేవలం ఉద్యోగం కాదు, ప్రజారోగ్యానికి భరోసా ఇచ్చే రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ప్రభుత్వ ఉత్తర్వులు, ఆహార భద్రత, ప్రమాణాల చట్టం (సెక్షన్ 38) ప్రకారం, సిబ్బంది సహకారం లేకున్నా, తనిఖీదారు తన అధికార పరిధిలో తనిఖీలు చేసి, పోలీసు లేదా న్యాయ సహాయాన్ని కోరవచ్చు. ప్రాథమిక అధికారాలను ఉపయోగించకుండా, సాకు చెప్పడం అనేది పరిపాలనా లోపంగా పరిగణించాలి. సిబ్బంది సహకరించకపోతే, జిల్లాలో ఆహార భద్రతా వ్యవస్థే కుప్పకూలిపోయిందనే సంకేతం ఇవ్వడం, శాఖలోని కీలక బాధ్యతపై పరోక్ష నిర్లక్ష్య వైఖరిని సూచిస్తున్నది.

### విజయవాడ నుంచి ఆదిలాబాద్ పాలన..

సదరు అధికారిణి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కావడం, ఆమె భర్త అక్కడే ఉండటం వల్ల, ఆమె నెలలో కేవలం వారం రోజుల కంటే ఎక్కువ రోజులు కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడం అత్యంత తీవ్రమైన అంశం. తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల బాధ్యతలు నిర్వహిస్తూ, ఎక్కువ రోజులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి రావడం అనేది ప్రజాధనం దుర్వినియోగం కిందకు వస్తున్నది. ఒక ప్రభుత్వ అధికారి తన వ్యక్తిగత కారణాల కోసం తరచూ సుదీర్ఘ ప్రయాణాలు చేస్తూ, కార్యాలయాన్ని నిర్లక్ష్యం చేయడం ఉద్యోగ నియమావళిని ఉల్లంఘించడమే. రెండు జిల్లాల ఇన్‌ఛార్జి బాధ్యతను అడ్డం పెట్టుకుని, ‘ప్రత్యేక డ్యూటీ’ పేరుతో విధులకు గైర్హాజరు కావడం వెనుక ఉన్నత స్థాయి సహకారం ఉందా లేదా అనే విషయంపై లోతైన విచారణ జరగాలి.

### నిలిచిపోయిన న్యాయ ప్రక్రియ..

అధికారిణి దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరు కావడం, సిబ్బంది సహకరించడం లేదనే సాకుతో, రెండు జిల్లాల్లో ఆహార భద్రతా చట్టం అమలు పూర్తిగా స్తంభించిపోయింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం (సెక్షన్ 42) ప్రకారం సేకరించిన నమూనాల విశ్లేషణ, తదుపరి న్యాయ చర్యలపై నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరిగింది. అసురక్షిత ఆహార పదార్థాలను విక్రయించిన వ్యాపారులపై సెక్షన్ 59 కింద జరిమానాలు లేదా క్రిమినల్ కేసులు నమోదు చేయించాల్సిన బాధ్యత తనిఖీదారుదే. అయితే, తనిఖీదారు అందుబాటులో లేకపోవడంతో, తీర్పులు ఆలస్యమై, ఆహారంలో కల్తీ చేసిన వారిపై చట్టపరమైన పట్టు సడలింది. విచారణ జరగాల్సిన వందలాది కేసులు పెండింగ్‌లో పడటం, అక్రమ వ్యాపారులు మరింత రెచ్చిపోవడానికి దారి తీస్తుంది. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, ప్రజల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడం కిందకు వస్తున్నది.

### పరిష్కారం.. & డిమాండ్..

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని లక్షలాది ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన ఒక కీలకమైన ప్రభుత్వ శాఖ, ఒక అధికారిణి వ్యక్తిగత ఉద్దేశం, దీర్ఘకాలిక గైర్హాజరు కారణంగా కుప్పకూలడం రాష్ట్ర ప్రభుత్వ పాలనపైనే తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది. ఒకవైపు ‘మా సిబ్బందే సహకరించరు’ అని చెప్పుకుంటూ, మరోవైపు నెలలో కేవలం వారం రోజులు మాత్రమే కార్యాలయానికి వస్తూ, రెండు జిల్లాల ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేసిన సదరు అధికారిణిపై తక్షణమే విచారణ జరిపించాలి. రెండు జిల్లాల ఇన్‌ఛార్జి బాధ్యతను వెంటనే ఉపసంహరించి, పూర్తికాలం పనిచేసే అధికారిని నియమించాలి. నిర్లక్ష్య వైఖరిని సహిస్తే, భవిష్యత్తులో ఇతర శాఖల అధికారులు కూడా ఇదే ధోరణిని అనుసరించే ప్రమాదం ఉన్నది. ప్రజారోగ్యాన్ని బలి చేస్తున్న ఈ నిర్లక్ష్యంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాల్సిన ఆవశ్యకత ఉన్నది.

సమయం



## రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత దానికనుగుణంగా నడుచుకోవాలి

● అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్



**నారాయణపేట, నవంబర్,26(సమయం న్యూస్) :** 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిందని, అందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని అంగీకరించిన (Indian Constitution day) రోజుగా జరుపుకుంటామని నారాయణపేట జిల్లా అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో భారత రాజ్యాంగ పీఠిక ను పోలీస్ అధికారులు సిబ్బంది అందరు చదవడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని అధికారంకంగా ఆమోదించినందున ఈ రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది అప్పటినుంచి మనం గణతంత్ర దేశంగా మారం అని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా పిలుస్తామని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం అని ఇది ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాత్రత్వం, వంటి హక్కులను అందిస్తుంది అని తెలిపారు. ఈరోజు మన హక్కులు బాధ్యతలు గుర్తు చేసుకోవాలని భారత రాజ్యాంగం ఇచ్చిన విలువలను కాపాడుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత దానికనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు వెంకటేశ్వర్లు,శివశంకర్, నరేష్,పురుషోత్తం,పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నవంబర్ 29 దీక్షా దివస్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం

● వరంగల్ హన్మకొండ జిల్లాల బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశా నిర్దేశం

**వరంగల్ నవంబర్26( సమయం న్యూస్).:** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కార్యక్రమంలో పాల్గొన్న హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కళ్ళపల్లి రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, రాజయ్య, నన్నపునేని నరేందర్

## ఎమ్మెల్యే నవీన్ యాదవ్. ప్రమాణ స్వీకారం.



**హైదరాబాద్ నవంబర్ 26( సమయం న్యూస్).:** ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుండి ఎన్నికైన వి. నవీన్ యాదవ్ గారిచే శాసనసభలో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు. శాసనసభ భవనంలోని స్పీకర్ చాంబర్లో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి అజహరుద్దిన్, మేయర్ విజయలక్ష్మి, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కార్పోరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు మరియు లెజిస్లేచర్ సెక్రటరీ వి. నరసింహా చార్యులు. నవీన్ యాదవ్ గారికి అభినందనలు తెలిపి అసెంబ్లీ రూల్స్ బుక్స్, ఐడెంటిటీ కార్డును అందజేసిన స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు.

## ఏకగ్రీవంగా యుటిఎఫ్ ఖమ్మం అర్బన్ మండల కమిటీ ఎన్నిక

● అధ్యక్ష కార్యదర్శులుగా రమేష్ , కృష్ణయ్య




**ఖమ్మం , నవంబర్ 26 : ( సమయం న్యూస్ ) :** యుటిఎఫ్ ఖమ్మం అర్బన్ మండల 12'వ మహాసభ సమావేశం యు టి ఎఫ్ భవనం లోని జియావుద్దీన్ప్రాంగణంలోజిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ , ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సందర్భంగా యు టి మండల కమిటీ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శి (తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్) గా రాయబారపు రమేష్ ,(జడ్పీహెచ్ఎస్ బల్లేపల్లి) బియ్యని కృష్ణయ్య(జడ్పీహెచ్ఎస్మల్లెమడుగు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఎన్నికల అధికారిగా సిహెచ్ రోజా వ్యవహరించారు. మండల కమిటీ సభ్యుల ప్రతిపాదన మేరకు 2025- 26 సంవత్సరానికి గాను నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. టీఎస్ యుటిఎఫ్ఖమ్మం అర్బన్ మండలనూతనఅధ్యక్షులుగా రాయబారపు రమేష్ , ప్రధాన కార్యదర్శిగా బియ్యని కృష్ణయ్య లతోపాటు ఉపాధ్యక్షులుగా ఎన్ నర్మదా( పిఎస్ కొత్తగూడెం) ,ఎండి ఆదిల్ )జడ్పీహెచ్ఎస్ కైకొండయిగూడెం)కోశాధికారిగా బి. వెంకటేశ్వర్లు( పిఎస్ గోపాలపురం) ఆడిటర్ గా టి. వెంకటేశ్వరరావు (జడ్. పి. హెచ్. ఎస్ మల్లెమడుగు) కార్యదర్శులుగా పుట్ట శ్రీనివాసరావు, విరిత, నాగ మోహిని, లూర్దుమేరీ, కె.శ్రీదేవి, బి నాగేశ్వరరావు,లనుఎన్నుకున్నారు .నూతన కమిటీ చే ఎన్నికల అధికారి సిహెచ్ రోజా , జిల్లా అధ్యక్షులు రంజాన్ , ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు లు ప్రమాణస్వీకారంచేయించారు. మండల ఇన్చార్జి వల్లంకొండ రాంబాబు పలు సూచనలు చేశారుఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జీవి . నాగమల్లేశ్వరరావు, బండి నరసింహారావు, కె. సాంబ మూర్తి, ఉద్దండు షరీఫ్,సుధాకర్ , సురేష్ , ఎల్లయ్య నూతన నాయకత్వానికి అభినందనలు ప్రకటించారు.

# రాజ్యాంగ పరిరక్షణ ,దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలి.

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.




**కామారెడ్డి నవంబర్26( సమయం న్యూస్) :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూరాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, కర్తవ్యాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరిస్తూ రాజ్యాంగ పరిరక్షణ, దేశ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజాసేవలో నిబద్ధతతో ఉండాలని సూచించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ (Constitution Day Pledge)భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాకసామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ:సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్నిఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని ,అంతస్తుల్లోనూ,అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడా నికిబీ వారందరిలోవ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందిం చడానికిమన ఈ రాజ్యాంగ పరిషత్ లో 1949, నవంబర్ 26 వ తేదీన ఎంపిక చేసుకొని, శాసనం గా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

అని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ, జిల్లా అధికారులు, పాల్గొన్నారు .

# ప్రపంచంలోకెల్లా సర్వోన్నతమైనది భారత రాజ్యాంగం

- పి. ప్రావీణ్య, జిల్లా కలెక్టర్.
- సంగారెడ్డి అంబేద్కర్ లా కళాశాలలో
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు.



**సంగారెడ్డి నవంబర్26( సమయం న్యూస్):** మన భారత రాజ్యాంగం అన్ని దేశాల రాజ్యాంగాలలో కంటే సర్వోన్నతమైనదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి అంబేద్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాలలో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది కలిసి భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ (National Constitution of India Pledge) ను చదివి, రాజ్యాంగ విలువలను పాటించేందుకు అంకిత భావంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు... ప్రపంచంలోకెల్లా అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగం భారత రాజ్యాంగం అని అన్నారు. భారత రాజ్యాంగం ఎప్పుడు నూతన మైనది అన్నారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మన రాజ్యాంగంలో మార్పులు చేర్పులను చేసుకొనే వెసులుబాటు రాజ్యాంగ వర్ణ మార్పులు చేర్పులను చేసుకొనే వెసులుబాటు రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. మన రాజ్యాంగం పరిధిలోకి ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులకు సమాన అవకాశాలు, సమాన అధికారాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణలో న్యాయ విద్యార్థుల పాత్ర ఎనలేనిదన్నారు. సంగారెడ్డి న్యాయ కళాశాలలో ప్రతిభగల అధ్యాపక బృందం ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. న్యాయ కళాశాల విద్యార్థులు తమ శిక్షణ కార్యక్రమంలో న్యాయవిద్యలో మేలుకువలు సాధించి ఉన్నత విద్యా అవకాశాలతో పాటు ఉత్తమమైన న్యాయవాదులుగా, న్యాయాన్ని న్యాయపుణులంగా గుర్తింపు పొందాలని కలెక్టర్ సూచించారు. న్యాయ విద్యా డిగ్రీ తో సరి పెట్టుకోకుండా ఉన్నత చదువులు చదివి జీవితంలో న్యాయ సంగారెడ్డి న్యాయ కళాశాల విద్యార్థులు స్థిరపడాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ కళాశాల అధ్యాపకుని ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తుల భవిష్యత్తు డిమాండ్

● చరిత ఆర్గానిక్ యూనిట్ను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ .



**పాల్వంచ నవంబర్26( సమయం న్యూస్).:** సేంద్రియ ఉత్పత్తులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్లో అమలవుతున్న సేంద్రియ పద్ధతులు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి ప్రక్రియలు, ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ వ్యవస్థలను సమగ్రంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. యూనిట్లో సేంద్రియ విధానాల్లో తయారుచేసే ఉత్పత్తులు విస్తృతంగా ఉన్నాయి. మునగాకు ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు, ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సోప్ల సహా మొత్తం 102 రకాల ఉత్పత్తులు సేంద్రియ పద్ధతిలో తయారుచేసి విక్రయిస్తున్నారు. గ్రామీణ వనరులను వినియోగిస్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తులను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ప్రత్యేకత. పరిశుభ్రత, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను కలెక్టర్ ప్రశంసించారు. యూనిట్లో సేంద్రీయ పద్ధతుల్లో ఆరోగ్యకరమైన కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం ఉత్పత్తి చేయడం, స్థానిక మార్కెట్లో మంచి ఆదరణ పొందడం కూడా కలెక్టర్ అభినందనీయమని చెప్పారు. పక్షులకు అందించే ఆహార దాన సిద్ధం పద్ధతి, గాలి ప్రసరణ, షెడ్, పరిశుభ్రత చర్యలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సేంద్రియ ఉత్పత్తులపై భవిష్యత్తులో అత్యధిక డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన దృష్ట్యా సేంద్రియ విధానాలు తప్పనిసరి అవుతున్నాయి అని, కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దానాన్ని బయటి మార్కెట్ నుండి కొనుగోలు చేయకుండా, మొక్కజొన్న పిండి, పల్లి చెక్క వంటి స్థానిక వనరులను ఉపయోగించి సేంద్రియ పద్ధతిలో తయారు చేయడం ద్వారా రైతులకు ఖర్చులను తగ్గించడమే కాక, ఉత్పత్తుల నాణ్యతను పెంచుతుంది, అని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా కౌజు పిట్టల పెంపకంపై ఆసక్తి పెరుగుతోందని, ఇటువంటి యూనిట్లు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయని. భవిష్యత్తులో ఈ యూనిట్ ద్వారా కౌజు పిట్టల పెంపకానికి అవసరమైన దానాన్ని ఇతర గ్రామాలకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించవలసిందిగా సూచించారు. కలెక్టర్ పరిశీలన కార్యక్రమంలో చరిత ఆర్గానిక్ యూనిట్ చైర్మన్ జయ, డాక్టర్ సోమరాజు దొర, యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక కోడులను వెంటనే రద్దు చేయాలి

- సిఐటియు ఆధ్వర్యంలో గజ్వేల్ సెంటర్లో నిరసన
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య




**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 26 :** కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక కోడు లను రద్దు చేయాలని, రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని లేనిచో దేశవ్యాప్త ఉద్యమం తీవ్రతం చేస్తామని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య అన్నారు. సిఐటియు గజ్వేల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అంబానీ అదాని ఆస్తులు పెంచడం కోసం కార్మిక రైతాంగ వ్యతిరేక చర్యలు పాల్పడుతుందని అన్నారు దేశంలో ఉన్నటువంటి భారత కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే విధంగా 29 కార్మిక చట్టాల రద్దుచేసి నాలుగు లేబర్ కోడు లు రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ కోడు ల వల్ల కార్మికుల ఉపాధికి ప్రమాదం ఉందని అన్నారు పరిశ్రమల ప్రమాదాలు పెరుగుతాయని కనీస వేతనాలు, ఆరోగ్యం భద్రత సంక్షేమ పథకాలు నిర్వీర్యం అవుతాయని అన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు, 12 గంటల పని, రాత్రి వేళలో మహిళలు అన్నారు పనిచేయడం, అనేక రూపంలో కార్మిక శ్రమ దోపిడీ పెరుగుతుందని అన్నారు ఫిక్స్ టైం ఎంప్లాయిమెంట్ పేరుతో ఉపాధి కల్పించడంతో శాశ్వత ఉద్యోగ భద్రత లేదని అన్నారు. విద్యుత్సరణ చట్టంతో సబ్సిడీలు ఉచిత విద్యుత్ పోతాయని అన్నారు. ఉపాధి కూలీలకు ఆన్లైన్ విధానం పెట్టడం వల్ల పని దినాలు తగ్గుతున్నాయని అన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడం లేదని పత్తి కొనుగోలులో అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, రంగారెడ్డి,రాజు కనుకయ్య యాదగిరి కుమార్ రాజులు శేఖర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు,

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమీక్ష




**మహబూబాబాద్, నవంబర్26( సమయం న్యూస్).:** బుధ వారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాల యం నుండి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ గూగుల్ మీట్ ద్వారా జిల్లా పరిధిలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, నర్సింగ్ అధికారులు, సబ్ సెంటర్ సిబ్బంది తో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆరోగ్య విభాగం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, లక్ష్యసాధన, సేవల నాణ్యత పై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ,టీకాకరణ,క్షయ నియం[ తణ, కార్యక్రమం, ఆర్బిఎస్కే, యన్ సి వి బి డి సి తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలని, సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తపరుస్తూ తల్లుల సమావేశంలో సాదారణ ప్రసవాలా పై అవగాహన కల్పించాలని, దానికి తగినట్లుగా గర్భిణిగా ఉన్నప్పుడు యోగా నేర్పించాలని ముఖ్యంగా మొదటి సారి గర్భం దాల్చిన స్త్రీల యొక్క ఇంటిలోని పెద్దవారికి సాదారణ ప్రసవం వల్ల కలిగే లాభాల పైన అవగాహన కలిపించాలని, ఇందుకోరకై జిల్లాలో బయ్యారం, కొత్తగూడ, గూడూర్, డోర్నకల్, తొర్రూర్, దంతాలపల్లి, నెల్లికుదురు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాదారణ ప్రసవాల ప్రోత్సాహక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంధి పైన తెల్పిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గర్భిణీలను తరలించి ప్రసవాలను చేయించాలని, గర్భిణి ల ప్రసవ కోసం అం చనా వేసిన తేదీ పట్టికలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, సిబ్బంది వద్ద వుండాలని అన్నారు. అన్ని లు లక్ష్య సాధనలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.లక్ష్యాలను చేరుకోలేక పనితీరు బలహీనంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో పని తీరు లోపిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.జిల్లాలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు చేరేలా ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, సేవల నాణ్యత పెంపుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డేటా నమో దులో ఖచ్చితత, ఫీల్డ్ విజిట్లు, సేవల అందుబాటు విషయ ంలో జాప్యం లేకుండా అమలు చేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సూపర్ వైజర్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంటల తర్వాత గడ్డి, కట్టెలను తగలబెట్టొద్దు

-వ్యవసాయ అధికారి శంకర రాథోడ్





**కొడంగల్ మండలం, నవంబర్,26(సమయం న్యూస్) :** పంట కోసిన తర్వాత గడ్డి, కట్టెలను రైతులు తగలబెట్టకూడదని కొడంగల్ (ఏడీఏ) మండల వ్యవసాయ అధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లోని ప్యాలమద్ది గ్రామములో వ్యవసాయ భూములను సిబ్బందితో కలిసి పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడే నిప్పు పెట్టడంతో పొగ వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. అంతకుమించి ఏమీ నష్టం జరుగుతుందో రైతులు తెలుసుకోవాలన్నారు. సైన్స్ ఆఫ్ టోటల్ ఎన్విరాన్మెంట్' జర్నల్లో ఇటీవల అచ్చుయిన ఒక అధ్యయన పత్రం ఈ విషయాలను లోతుగా చర్చించిందనీ... గడ్డిని కాల్చేస్తే ఆ భూమిలోని సూక్ష్మజీవారాశి జీవవైవిధ్యం నశించి, పొలం పర్యావరణ వ్యవస్థల సహాజ క్రియాలకు విఘాతం కలుగుతుందని ఈ అధ్యాయనం వివరించిందన్నారు. భారత్ సహా అనేక దేశాల్లోని పొలాల్లో గడ్డిని కాల్చటం వల్ల భూమికి, రైతుకు ఎలా నష్టం జరుగుతున్నదో తెలుసుకోవటానికి 250 అధ్యయన ఫలితాలను క్రోడీకరించి విశేషించాయన్నారు. గడ్డిని తగలబెట్టినప్పుడు 38.8-42.2 డిగ్రీల సెల్సియస్ వరకు మట్టి ఉష్ణోగ్రత పేరుగుతుందనీ, ఆ వేడికి మట్టిలోని నత్రజని నశిస్తుందని, సేంద్రియ పదార్థం తగ్గిపోతుందనీ, అంగుళం లోతు వరకు ఉండే మట్టి లోని అపారమైన సూక్ష్మజీవులు చనిపోతాయనీ, చీడపీడల బెడద పెరుగుతుందనీ, ఎరువు మరింత ఎక్కువ వేయాల్సి వస్తుందనీ వారు తెలిపారు. పోలంలో కనిపించే పురుగులను ఏరుకు తినేసే సాలీళ్ళు , ఆరుద్ర పురుగులు, కప్పల సంఖ్య గడ్డి గాదాన్ని తగులబెట్టిన పొలాల్లో పెద్దగా కనిపించవు అన్నారు. మంట పెట్టేటప్పుడు వెలువడే అధిక ఉష్ణోగ్రత మట్టి ఆరోగ్యం బాగా దెబ్బతింటుందనీ, మట్టిలో ఉండే పోషకాలను మొక్కల వేర్లు తీసుకోగలిగే రూపంలోకి మార్చి అందించే అద్భుతమైన సహజ పోషణ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. గడ్డిగాదాన్ని కాలబెట్టకుండా నేల పై కప్పి ఆచ్ఛాదన చేయటం ఎన్ని విధాల మేలు అని అధ్యయం తేటతెల్లం చేసిందనీ వారు తెలిపారు తెలిపారు.ఎఇఓ అశ్వినీ మరియు ప్యాలమద్ది గ్రామ రైతులు ఉన్నారు.

# చేనేత వస్త్రాలు ప్రజారోగ్యానికి ఆరోగ్య సూచిక చేనేత వస్త్రాలు

- పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోలి బొత్తుల దేవదాసు గజ్వేల్బి ప్రజ్ఞాపూర్ .




**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 26 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోనీ గజ్వేల్ చేనేత సహకార సంఘంను సందర్శించుటకు ఈరోజు రష్యా నుండి ప్రొఫెసర్ ఆండ్రీ, ప్రొఫెసర్ లుపా, ప్రొఫెసర్ అలీనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొఫెసర్స్ రావడం జరిగినది. వారు గజ్వేల్ చేనేత సహకార సంఘంలో మన చేనేత మగ్గాలను పరిశీలిం చడం జరిగింది . ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు బోల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి చేనేత వస్త్రాలు ఆరోగ్య సూచికగా కొనియాడినారు. దేవతలకు వస్త్రాలు అందించిన పద్మశాలీలు ప్రజల మానప్రాణాలను కాపాడిన పద్మశాలీల అందరికీ పాదాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. వస్త్రాలు ధరించలేనిది సమాజంలో బ్రతకడం కష్టమన్నారు. డబ్బులు ఎన్ని ఉన్న ఎంత పరపతి ఉన్న వస్త్రం ధరించలేనిది సమాజంలో సిగ్గుతో తిరగలేము అన్నారు. సమాజంలో పద్మశాలీల గొప్పతనం ఎనలేనిదని

కొని అడిగినారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు బాలచంద్రం కుల పెద్దలు బింగి పురుషోత్తం రామకోటి రామరాజు, కృష్ణమూర్తి ఆంజనేయులు పూల సత్యము శ్రీనివాస్ కాంట్రాక్టర్, సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనుప్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ సిద్దిపేట జిల్లా ప్రచార కార్యదర్శి గాడిపల్లి బలరాం, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు కోశాధికారి దేవసాని హనుమాన్ దాస్ ,గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్ , యువజన సంఘం ప్రధాన కార్యదర్శి హనుమాన్ల నాగరాజు నేత, కోశాధికారి గుండు మల్లేశం, యువజన సంఘ సభ్యులు సుధాకర్, సాయి మహేష్, నరేష్ మహేందర్, సత్యనారాయణ, కృష్ణ, రమేష్, మరియు పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# సౌత్ సెంట్రల్ రైల్వే ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్ సేవలను ఏకీకృతం చేస్తూ యాప్ ఆధారిత పార్సిల్ లోజిస్టిక్స్ సేవలు అభివృద్ధి

**సికింద్రాబాద్ నవంబర్26( సమయం న్యూస్).:** రైలు ప్రయాణికులు లేదా పార్సిల్ రైళ్ల ద్వారా తమ పార్సిళ్లు బుక్ చేసుకునే వినియోగదారులకు డోర్ టు డోర్ సర్వీస్ అందించడానికి, సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్ కొత్తగా యాప్ ఆధారిత పార్సిల్ లోజిస్టిక్స్ ప్లాట్ఫారమ్ను రూపొందిస్తోంది. ఈ యాప్ ద్వారా First Mile (pickup), Mid Mile (Railway transportation) మరియు Last Mile (delivery) సేవలను ఒకే వేదికలో కలిపి నిరంతరాయ సేవను అందించేలా చర్యలు చేపడుతోంది.ఈ అప్లికేషన్ను మొదటిగా హైదరాబాద్ డివిజన్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ క్రమంలో ఫస్ట్ మైల్ పికప్ మరియు లాస్ట్ మైల్ డెలివరీ సేవల కోసం రైల్వేతో భాగస్వామ్యం చూపే ఆసక్తి గల లాజిస్టిక్స్/ఫ్లీట్ సర్వీస్ ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. ఈ సేవలలో భాగస్వామ్యం కావాలనుకునేవారు హైదరాబాద్ డివిజన్ కమర్షియల్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

ఈ యాప్ ద్వారా:

- పార్సిల్ బుకింగ్, ట్రాకింగ్, డిజిటల్ చెల్లింపులు ఒకే వేదికలో అందుబాటులోకి వస్తాయి
- పార్సిల్ రవాణా మరింత వేగంగా, పారదర్శకంగా, సులభంగా మారుతుంది
- ఇంటి వద్దే పికప్ చేసి డెలివరీ చేసే పూర్తి సేవ అందుతుంది
- వ్యాపారాలు, లాజిస్టిక్స్ భాగస్వాములు, వ్యక్తులకు ఒకే డిజిటల్ ఎకోసిస్టమ్ లభిస్తుంది

అప్లికేషన్ ముఖ్య ప్రయోజనాలు:

ఆన్లైన్ బుకింగ్, డిజిటల్ పేమెంట్ సౌకర్యం
రియల్-టైమ్ పార్సిల్ ట్రాకింగ్
డోర్స్టెప్ పికప్ నుండి డోర్స్టెప్ డెలివరీ వరకు నిరంతరాయ సేవ
పారదర్శకత, సులభ చెల్లింపు విధానం

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఈ సేవ రవాణా రంగంలో గేమ్చేంజర్ అవుతుందని, రైల్వేలు అందిస్తున్న లోజిస్టిక్స్ సేవలకు ఇది మరింత బలం చేకూరుస్తుందని తెలిపారు. ఫస్ట్ మైల్%-%లాస్ట్ మైల్ సేవల కోసం రైల్వేతో భాగస్వామ్యం చూపే ఏజెన్సీలను ఈ కొత్త డిజిటల్ ప్లాట్ఫారమ్ ప్రయోజనం చేస్తుందని అన్నారు.

# సివిల్ సప్లై అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన.



**భూపాల పల్లి నవంబర్26( సమయం న్యూస్).:** బుధవారం జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్కుమార్ డీఎం, సీఎస్సీ రాములు, యూడీఆర్ఐ అధికారులతో కలిసి గాంధీనగర్, బుద్ధారం, ఘన్పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పౌర సరఫరాల అధికారి ఇన్చార్జీలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎఫ్ఏక్యూప్రమాణాల మేరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే సంబంధిత బియ్యపు మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని, కేంద్రాలలో తూకం, బిల్లింగ్, రవాణా ప్రక్రియలను పర్యవేక్షిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పూర్తిస్థాయిలో బాధ్యతతో పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఆర్ ఐ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన చేసిన అదనపు జిల్లా కలెక్టర్.



**జనగాం నవంబర్26( సమయం న్యూస్). :** బుధవారం అదనపు కలెక్టర్( రెవెన్యూ) బెన్ షాలోమ్..విశ్వనాథ్ పురం గ్రామంలోని పిపిసి సెంటర్ ను సందర్శించి... కొనుగోలు వేగవంతం కావాలని సూచించారుఅనంతరం ఘన్పూర్ డివిజన్ ఆర్డిఓ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తు ల, పాడి ప్రోక్యుర్మెంట్ పైన రివ్యూ చేసి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలను జారీ చేసారు

# వరంగల్ పోలీస్ కమిషనరేట్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు




**హన్మకొండ నవంబర్26( సమయం న్యూస్) :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలవేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయుంచారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు వుందని.రాజ్యాంగ పరిరక్షణ, దేశ అభివృద్ధికి కట్టుబడి వుండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఏ.ఆర్ అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు,బాల స్వామి సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జాన్ నర్సింహులు, డేవిడ్ రాజు, నాగయ్య,గిరికుమార్, సురేంద్ర,ఏ.ఓ సంపత్ కుమార్ తో పాటు ఆర్.ఐలు, ఇన్స్ స్పెక్టర్లలు, ఇతర పోలీస్, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# మాన్యువల్ స్కావెంజర్ల వివరాలను వారం రోజుల్లో సమాచారం ఇవ్వండి.



**మహబూబాబాద్, నవంబర్.26.( సమయం న్యూస్).:** భారత ప్రభుత్వం జారీ చేసిన మాన్యువల్ స్కావెంజర్స్ యొక్క మార్గదర్శకాలు తేది: 01-02-2024 అనుసరించి మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ చట్టం - 2013 ప్రకారం గౌరవ జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ మహబూబాబాద్ గారు జిల్లా స్థాయి మాన్యువల్ స్కావెంజర్స్ సర్వే కమిటీలను మరియు డివిజన్ స్థాయి సర్వే కమిటీలను ఏర్పాటు చేయనైనదని అట్టి సర్వే కమిటీల ద్వారా మహబూబాబాద్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్ పరిశీలన చేపట్టడం జరిగిందని అందులో భాగంగా ప్రతి (గ్రామ పంచాయతీ మరియు మున్సిపాలిటీల యొక్క నోటీస్ బోర్డుపై మరియు అన్ని కార్యాలయ నోటీసు బోర్డుల పై మాన్యువల్ స్కావెంజర్ గుర్తింపు సంబంధించిన ప్రకటన ఉంచనైనదని మరియు మాన్యువల్ స్కావెంజర్స్ గుర్తించినచో తేదీ. 04.11.2025 లోపు సంబంధిత కార్యాలయమునకు తెలియజేయాల్సిందిగా తెలియజేయునైనది, కానీ మ్యానువల్ స్కావెంజర్స్ ఉన్నట్లు నమోదు కాలేదు మరియు మహబూబాబాద్ జిల్లాలోని అన్ని (గ్రామ పంచాయతీ ల పరిధిలోని, మరియు (5) మునిసిపాలిటిలలో మాన్యువల్ స్కావెంజర్స్ ఎవరు లేరని సంబంధిత సర్వే టీం ల నివేదిక ద్వారా తెలియవచ్చింది. ఇట్టి విషయములో ఇంకనూ తెలియజేయునది, ఏమనగా మాన్యువల్ స్కావెంజర్స్ ఏ (గ్రామములో మరియు మునిసిపాలిటీలలోనైనా ఉన్నట్లు ఎవరైన గుర్తించిన యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నెంబర్-17 (2వ అంతస్తు) IDOC మహబూబాబాద్ నందు తెలుపగలరు. గడువు ముగిసిన తేదీలోపు ఎలాంటి అభ్యంతరాలు నమోదు కానిచో మహబూబాబాద్ జిల్లాను మాన్యువల్ స్కావెంజర్స్ ఫ్రీ (Manual Scavengers Free) గా ప్రకటించబడునని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. శ్రీనివాస రావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

# నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక**



**మంచిర్యాల నవంబర్26( సమయం న్యూస్) :** రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహి ంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారి శంకర్ లతో కలిసి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, నామినేషన్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల ప్రకటన విడుదల అయినందున తదనగుణంగా ఎన్నికల నిర్వహణలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులు జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ తయారీలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ 50 రూపాయల కంటే తక్కువగా ఉండకూడదని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన, ఓట్ల లెక్కింపు అంశాలలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి రద్దు

**• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల నవంబర్26( సమయం న్యూస్).** నవంబర్ 26, 2025:2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 దృష్ట్యా ప్రతి సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించు వివరాలను పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే

**- పట్నం నరేందర్ రెడ్డి**



**కోస్గి,గుండుమాల్,మండలం, నవంబర్,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి, గుండుమాల్ మండలాల ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశానికి హాజరై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు కార్యకర్తలకు మాజీ ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేసిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోంరాస్ పేట్ యందు సమావేశం

**బొంరస్ పేట,మండలం నవంబర్,26(సమయం న్యూస్)**




బొంరస్ పేట పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి పాఠశాల ఇంచార్జ్ .కాశయ్య అధ్యక్షత వహించారు .ఈ కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ 1947 లో బ్రిటిష్ వారు మనకు స్వాతంత్రం ఇవ్వడం జరిగింది. ఆనాడు బ్రిటిష్ ఇండియా ఆదీనంలో ఉన్న ప్రాంతాల నుండి మరియు సంస్థానాలు నుండి, వివిధ ప్రాంతాల నుండి సుమారుగా 389 సభ్యుల పైన రాజ్యాంగ పరిషత్తు కు ఎన్నిక అయ్యారు రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రచనలో భాగంగా 22 కమిటీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ...రాజ్యాంగ రచన చేశారు ఈ అన్ని కమిటీలతో ముఖ్యమైనది డ్రాఫ్టింగ్ కమిటీ ఏడుగురు సభ్యులతో బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడింది ఈ డ్రాఫ్టింగ్ కమిటీ ప్రపంచంలోని వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, భారతదేశానికి ఎలాంటి చట్టము , నియమాలు, నిబంధనలు, రూల్స్ తయారు చేయాలనే అంశాన్ని నిశితంగా పరిశీలించి, అధ్యయనం చేసి అన్ని విషయాలను భారత రాజ్యాంగం లో చేర్చారు డ్రాఫ్టింగ్ కమిటీ తయారుచేసిన ముసాయిదాను రాజ్యాంగ పరిషత్తు 1949 నవంబర్ 26 న ఆమోదించడం జరిగింది రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగాన్ని ఆమోదించిన శుభదినం సందర్భంగా నేడు మనం రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నాము. మన రాజ్యాంగం గజరాజ్యం గమని ప్రపంచంలో అతిపెద్దదైన లిఖిత రాజ్యాంగం. 448 ఆర్టికల్ ,12 షెడ్యూల్స్, 25 భాగాలు లతో పెద్ద రాజ్యాంగం. భారత రాజ్యాంగానికి పీఠిక ఆత్మవంటిదని విద్యార్థుల చేత పీఠికను ప్రతిజ్ఞ చేయించడం జరిగింది సోషల్ ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య .ఆ సందర్భంగా ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ కాశయ్య మాట్లాడుతూ రాజ్యాంగ సభ విశిష్టత,పీఠికలోని అంశాలు విద్యార్థులకు తెలపడం జరిగింది. ఆ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శివరాజ్ , ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

# 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**• జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ఖమ్మం, నవంబర్ 26: ( సమయం న్యూస్ ) :** జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 566 గ్రామ పంచాయతీ సర్పంచ్, 566 ఉప సర్పంచ్, 5168 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 7 మండలాల్లోని 192 గ్రామాలు, 1740 వార్డులకు, రెండవ విడత డిసెంబర్ 14న 6 మండలాల్లోని 183 గ్రామాలు, 1686 వార్డులకు, మూడవ విడత డిసెంబర్ 17న 7 మండలాల్లోని 191 గ్రామాలు, 1742 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న, రెండవ విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు, తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, మరుసటి రోజు అప్పీళ్లను స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండవ విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 9 మధ్యాహ్నం మూడు గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 166 ఎస్టి (మహిళలు 75, జనరల్ 91), 110 ఎస్సీ (మహిళలు 48, జనరల్ 62), 54 బీసి (మహిళలు 24, జనరల్ 30), 236 అన్ రిజర్వ్ క్యాటగిరి (మహిళలు 112, జనరల్ 124) లుగా రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 7 లక్షల 95 వేల 138 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటా రని, 708 పోలింగ్ లొకేషన్ లలో 5168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సర్పంచ్ ఎన్నికలకు 9 లక్షల 51 వేలు, వార్డు సభ్యుల ఎన్నికలకు 9 లక్షల 51 వేల బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశామని, 4894 జంబో, 852 మీడియం బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 566 రిటర్నింగ్ అధికారులు, 3442 పోలింగ్ అధికారులు, 4217 ఇతర పోలింగ్ అధికారులు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,15 స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, 76 జోనల్ అధికారులు, 25 టిఓటీ, 241 రూట్ అధికారులు నియమించామని, 20 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లు, 191 రిసెప్షన్ కేంద్రాలను, 566 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో గుర్తించిన 1858 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ కు ఏర్పాట్లు చేశామని, 648 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు నమోదు చేయాలనుకునే వారు 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా ఎం.సి.ఎం.సి. అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, జర్నలిస్టులు, వివిధ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మూసాపేట్, భూత్పూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**• నిర్ణీత నాణ్యత ప్రమాణాలు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి**

**మూసపేట, భూత్పూర్ నవంబర్26( సమయం న్యూస్).**



నిర్ణీత నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారుమూసాపేట్, భూత్పూర్ మండలంలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. మూసాపేట మండలం లో పోల్కంపల్లి గ్రామం లో భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలలో ఏర్పాటు పి. ఏ .సి.ఎస్. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మూసాపేట మండలం లో పోల్కంపల్లి గ్రామం లో పి. ఏ.సి.ఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు .ఎప్పటికప్పుడు తేమశాతం చెక్ చేయాలనీ, ప్రతిరోజూ సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు ఈ సందర్భంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే లోడ్ చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఏ రైతు మిల్లులకు వెళ్ళవలసిన అవసరం లేదు అని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీ లు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను వినియోగించు కొంటున్నారా అని అడిగింది? ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ కొద్దిగా మోటర్ రిపేరింగ్ ఉంది అని చెప్పడంతో ఆటోమెటిక్ ప్యాడి క్లీనర్ ని పరిశీలించింది సంబంధిత అధికారులకు ఆదేశించి వెంటనే ప్యాడి క్లీనర్ రిపేరింగ్ చేపిస్తామని చెప్పారు.

అనంతరం భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో రైతులతో మాట్లాడుతూ కొనుగోలులో తలెత్తిన సమస్యలు తెలుసుకున్నారు నిర్ణీత తేమ శాతం,తాలు,మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రైతులకు తెలిపారు

# జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు,అక్రమ రవాణాకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్.
- 10 వాహనాలను సీజ్ చేసి నిందితులపైనా కేసులు నమోదు చేయడం జరిగింది-ఎస్పీ



**వికారాబాద్, నవంబర్,26(సమయం న్యూస్) :** జిల్లాలో ఇసుక, ఎర్రమట్టి మరియు ఎర్ర రాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా (ఐపీఎస్) కఠిన చర్యలకు ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా టాస్క్ ఫోర్స్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు జిల్లావ్యాప్తంగా అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను తరలిస్తున్న వారిపై నిఘా పెంచి, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. గత నాలుగు రోజులలో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు 6 ఇసుక ట్రాక్టర్లను, 3ఎర్రమట్టి టిప్పర్ లను, ఒకటి ఎర్రరాయి లారీ ని మరియు ఒక జేసిబి తో కలిపి మొత్తం 10 వాహనాలను సీజ్ చేసి నిందితులపైనా కేసులు నమోదు చేయడం జరిగింది.అట్టి వివరాలలోకి వెళ్ళగా, ఈ విస్తృత తనిఖీలలో భాగంగా బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను, అలాగే, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరిగేట్‌పల్లి గ్రామంలో అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను మరియు ఒక జేసీబీ వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇసుక ట్రాక్టర్‌ను, యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్ర రాయిని తరలిస్తున్న లారీని టాస్క్ ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకొని, సంబంధిత పోలీస్ స్టేషన్లలో బాధ్యులైన డ్రైవరుల,యజమానులపైనా చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరిగింది.జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ, ఈ అక్రమ రవాణా వలన ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాక, పర్యావరణ సమతు ల్యత దెబ్బతింటుందని ఎస్పీ తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠి నమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలియజేశారు. అక్రమ తరలింపులు జరిగిన, అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు లేదా స్థానిక పోలీ సులకు సమాచారం అందిం చాలని, సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపినారు.

# ఆదర్శ పాఠశాలను సందర్శించిన జి.సి.డి.ఓ. శ్రీదేవి, ఎంఈఓ గోపాల్



**పరిగి మున్సిపల్(మం)నవంబర్,26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని మోడల్ స్కూల్ ఆదర్శ పాఠశాలను వికారాబాద్ జిల్లా జి.సి.డి.ఓ. శ్రీదేవి మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎం. గోపాల్ బుధవారం సందర్శించారు. పాఠశాల విద్య, వసతి, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు.సందర్శనలో భాగంగా జి.సి.డి.ఓ. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, ఆరోగ్యం పరిశుభ్రత ద్వారానే సాధ్యమని తెలిపారు. విద్యార్థులందరూ శుభ్రంగా ఉండేలా కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, విద్యార్థులకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందజేయాలని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మిని ఆదేశించారు.హాస్టల్‌ను పరిశీలించిన శ్రీదేవి, విద్యార్థినులందరూ తమ ఆరోగ్య రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠశాలలో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా వంటశాల సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత, విద్య, హాస్టల్ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. ఎంఈఓ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడం తమ బాధ్యత అని, చదువులో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు పట్టుదలతో సిద్ధం కావాలన్నారు. పాఠశాల హాస్టల్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే పై అధికారులకు తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నికైన డిటి విజయేందర్.

- ఘనంగా సన్మానించిన దళిత, ప్రజా సంఘాల నాయకులు

**పరిగి మున్సిపల్(మం) నవంబర్ 26(సమయం న్యూస్)**

పరిగి మండల డిప్యూటీ తాహసిల్దార్ విజయేందర్ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ (ట్రెసా)జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్ పల్లి శ్రీనివాస్, అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మంచన్పల్లి శ్రీనివాస్, దళిత బహుజన ఫ్రంట్ మాజీ అధ్యక్షుడు రత్నం తదితరులు పాల్గొన్నారు.విజయేందర్ ప్రజల సమస్యలను నిస్వార్థంగా పరిష్కరిస్తూ, రెవెన్యూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతూ రావడం ప్రశంసనీయమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇకపై మరింత ఉన్నతస్థాయిలో సేవలు అందించి సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ అనిల్ బాబు, జీపీఓలు రమేష్, రాం చందర్, దళిత సంఘాల నాయకులు ప్రేమ్ కుమార్, మంచన్పల్లి భరత్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్న నవీన ఆదర్శ స్కూల్ విద్యార్థులు

- డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు
- భారత రాజ్యాంగం గురించి తెలియజేసి,
- భారత రాజ్యాంగాన్ని చదవాలన్నారు-ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి నరేష్ రాజ్




**కొడంగల్ మున్సిపల్,(మం)నవంబర్ 26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ స్కూల్ లో ఘనంగా 76వ భారత రాజ్యాంగం దినోత్సవం జరుపుకున్న విద్యార్థులు ఉపాధ్యాయ బృందం. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ . అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి వి నరేష్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు భారత రాజ్యాంగం గురించి తెలియజేశారు.అందరూ భారత రాజ్యాంగాన్ని చదవాలని తెలియజేశారు..ఇట్టి కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష , ఉపాధ్యాయుల బృందం పాల్గొని ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు..

# నారాయణపేట కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ప్రారంభం

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి ప్రారంభించిన ఎస్పీ డాక్టర్ వినిత్ ఐపీఎస్
- మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుంది-కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, నవంబర్,26(సమయం న్యూస్) :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలసి ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డీపీఆర్ వో రషీద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, డీపీఆర్ వో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు
- నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు
- మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలి
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్

**హైదరాబాద్ నవంబర్ 26( సమయం న్యూస్) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని సూచించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని బుధవారం జిల్లా కలెక్టర్లు, సీ.పీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గల గ్రామ పంచాయతీలకు మూడు విడతలలో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని గుర్తు చేశారు. డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా అప్డేట్ చేసిన రిజర్వేషన్లు, ఏ విడతలో పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ తదితర వివరాలను వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో నమోదు చేయాలని సూచించారు. టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని అన్నారు. నవంబర్ 23న ఖరారు చేసిన తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను అనుసరిస్తూ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని, పోలింగ్ కేంద్రాలలో వెలుతురు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, తాగు నీరు, టాయిలెట్స్ వంటి కనీస వసతులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని సూచించారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు .నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని, పంచాయతీ ఎన్నికలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబర్ 30న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని తెలిపారు. అభ్యర్థుల జాబితాపై అప్పీల్స్ కోసం డిసెంబర్ 01, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2 నాడు అప్పీల్స్ పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 03 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందని, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలని సూచించారు.నామినేషన్ల స్వీకరణ, పరిశీలన,అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులు పర్యవేక్షణ చేస్తూ, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయకూడదంటూ ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారంకు సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ లకు సూచించారు. ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏ.ఈ.ఓ (సహాయ వ్యయ వివరాల నమోదు అధికారి), ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా స్థాయిలో ఎం.సి.ఎం.సి కమిటి, మీడియా సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి ఉండాలని అన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపథ్యంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.

ఎం.సి.సి అమలులో నిర్వహించే తనిఖీలలో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలనే వివరాలు ఆ రసీదు లో తెలియజేయాలని అన్నారు.

# మద్దూరు పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్-శ్రీకాంత్



**మద్దూరు మున్సిపల్(మం)నవంబర్ 26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల యొక్క లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి వారి యొక్క ఇండ్లను మున్సిపల్ కమిషనర్ స్వయంగా పరిశీలించడం జరిగింది.త్వరితగతిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోగలరని మద్దూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ లబ్ధిదారులకు తెలపడంజరిగింది.

# చిత్తుగా ఓడిన టీమిండియా

**సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన దక్షిణాఫ్రికా**

**రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఘన విజయం**

**140 పరుగులకే కుప్పకూలిన భారత్**

**408 పరుగుల భారీ తేడాతో గెలుపు**





భారత క్రికెట్ జట్టుకు టెస్టుల్లో మరో ఘోర ఓటమి ఎదురైంది. గతేడాది న్యూజిలాండ్ చేతిలో 0-3తో వైట్ వాష్ అయిన భారత జట్టు.. సరిగ్గా ఏడాది తర్వాత మ-రోసారి వైట్ వాష్ అయ్యింది. అయితే ఈసారి సౌతాఫ్రికా చేతిలో.. రెండో టెస్టులో ఘోరంగా ఓడింది. ఏకంగా 408 పరుగు తేడాతో చిత్తు చిత్తుగా ఓడింది. ఈ క్రమంలో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-0తో దక్షిణాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. కాగా భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇన్ని పరుగుల తేడాతో ఓడడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలంటే చివరి రోజంతా క్రీజులో నిలవాల్సిన పరిస్థితిలో.. ఓవర్ నైట్ స్కోరు 27/2 తో ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌ను భారత్ కొనసాగించింది. అయితే మరో 113 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లను కోల్పోయింది. టీమిండియా బ్యాటర్లలో రవీంద్ర జడేజా (54 87 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీ చేశాడు. యశస్వి జైస్వాల్ (13), సాయి సుదర్శన్ (14), వాషింగ్టన్ (16) లు మినహా మిగిలిన అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో సైమన్ హార్మర్ ఆరు వికెట్లు తీశాడు. కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సేనురన్ ముత్తుసామిలు చెరో వికెట్ పడగొట్టారు. యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6), సాయి సుదర్శన్(14), కుల్దీప్ యాదవ్(5), ధ్రువ్ జురెల్(2), రిషభ్ పంత్(13), వాషింగ్టన్ సుందర్(16), మహమ్మద్ సిరాజ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. సౌతాఫ్రికా బౌలర్లలో సిమన్ హర్మర్(6/37) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సీనర్ మ-ుత్తుసామి తలో వికెట్ తీసారు. రెండో ఇన్నింగ్స్‌ల్లో కలిపి భారత్.. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోర్‌ను కూడా చేయలేకపోయింది. రోడ్డులాంటి పిచ్‌పై భారత బ్యాటర్లు విఫలమవ్వడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. సెనరన్ ముత్తుసామి(206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) సెంచరీ సాధించగా.. మార్కో జాన్సెన్(91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది.

**మ్యాచ్ సంక్షిప్త స్కోరు..**

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్-489 ఆలౌట్
భారత తొలి ఇన్నింగ్స్-201 ఆలౌట్
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్-260 5 డిక్లేర్
భారత్ రెండో ఇన్నింగ్స్-140 ఆలౌట్

# స్వదేశంలో రెండుసార్లు క్లీన్ స్వీప్!

**హెడ్ కోచ్‌గా గౌతమ్ పరిస్థితి ఏంటి?**



టీమిండియా మరో టెస్టు సిరీస్‌లో ఓడిపోయింది. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌లో ఘోరంగా పరాజయం పాలైంది. ఇది ఒక్కటే కాదు భారత్ హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే ఆయన కోచింగ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆటగాళ్లను పంపించిన విధానంపై, జట్టు కూర్పుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో భారత క్రికెట్ జట్టు మరో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది. దక్షిణాఫ్రికా, భారతదేశంలో ఆడిన 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. ఈ ఓటమితో గంభీర్ కోచింగ్‌పై కూడా ప్రశ్నలు తలెత్తాయి, అతను ఒక టెస్ట్‌లో వాషింగ్టన్ సుందర్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి పంపాడు. తదుపరి మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్ మార్చారు. ధ్రువ్ జురెల్, రిషబ్ పంత్ ఇద్దరు వికెట్ కీపర్లను ప్లేయింగ్ 11లో ఉంచే వ్యూహం కూడా ఫ్లాప్ అయ్యింది. జట్టులో టెస్ట్ స్పెషలిస్టుల స్థానంలో ఆల్ రౌండర్లకు ప్రాధాన్యతనిస్తున్నారు, అయితే వారిని కూడా సరిగా ఉపయోగించడం లేదు. నితీష్ కుమార్ రెడ్డి రెండో టెస్ట్ ఆడాడు, కానీ రెండు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 10 ఓవర్లు మాత్రమే వేశాడు. ఇక్కడ గౌతమ్ గంభీర్ రిపోర్ట్ కార్డ్‌ను పరిశీలిద్దాం. అతని కోచింగ్‌లో భారత్ ఎన్ని టెస్ట్‌లు ఆడిందో, వాటిలో ఎన్ని మ్యాచ్‌లు భారత్ గెలిచిందో, ఎన్ని ఓడిపోయిందో తెలుసుకోండి. ఇక్కడ అతని కోచింగ్‌లో టెస్ట్ సిరీస్‌ల రికార్డు కూడా ఇచ్చాం. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో భారత క్రికెట్ జట్టు ఇప్పటివరకు మొత్తం 19 టెస్ట్‌లు ఆడింది. వీటిలో టీమ్ ఇండియా కేవలం 7 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. దక్షిణాఫ్రికాతో గువాహటిలో ఓడిపోవడం గంభీర్ కోచింగ్‌లో భారత్‌కు 10వ ఓటమి. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్‌కు ఇది ఆరో టెస్ట్ సిరీస్. న్యూజిలాండ్‌తో భారత్ స్వదేశంలో 0-3తో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది, ఆ తర్వాత దక్షిణాఫ్రికా కూడా టీమ్ ఇండియాను భారత్‌లో క్లీన్ స్వీప్ చేసింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్ పర్యటనలో భారత్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-2తో సమం చేసింది, ఆ తర్వాత వెస్టిండీస్‌ను స్వదేశంలో 2-0తో ఓడించింది. కానీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ జట్టు దక్షిణాఫ్రికా ముందు టీమ్ ఇండియా పూర్తిగా విఫలమైంది. గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో ఆడిన 6 టెస్ట్ సిరీస్‌లలో 3 టీమ్ ఇండియా కోల్పోయింది. న్యూజిలాండ్‌తో 2024లో స్వదేశంలో 0-3తో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (2024-2025) సిరీస్‌ను 1-3తో కోల్పోయింది. ఇప్పుడు దక్షిణాఫ్రికా టీమ్ ఇండియాను భారత్‌లో ఓడించింది. గంభీర్ కోచింగ్‌లో టీమ్ ఇండియా స్వదేశంలో టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ ఓటమి పాలుకావడం ఇది రెండోసారి.

## ఓటమి తీవ్ర నిరాశకు గురి చేసింది

**జట్టుగా మేం చాలా మెరుగవ్వాలి.. మ్యాచ్ అనంతరం రిషభ్ పంత్**



జట్టుగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోకపోవడంతోనే ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నామని టీమిండియా తాత్కలిక టెస్ట్ కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. ప్రత్యర్థి తమ కంటే మెరుగైన ప్రదర్శన చేసిందని చెప్పాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 408 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ విజయంతో సౌతాఫ్రికా 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. 93 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో టీమిండియా వరుసగా రెండో ఏడాది సొంతగడ్డపై క్లీన్ స్వీప్ అయ్యింది. గతేడాది ఇదే సమయంలో న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను 3-0తో కోల్పోయింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్ గెలిచింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రిషభ్ పంత్.. ఈ ఘోర పరాజయం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నాడు. సౌతాఫ్రికా తమ కంటే మెరుగ్గా ఆడిందని కొనియాడాడు. 'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురి చేసింది. జట్టుగా మేం చాలా మెరుగవ్వాలి. మా కంటే బాగా ఆడిన సౌతాఫ్రికాకు ఈ గెలుపు దక్కాల్సిందే. సిరీస్ మొత్తం వారు ఆధిపత్యం చెలాయించారు. అయితే క్రికెట్‌ను ఏ మాత్రం తేలికగా తీసుకోవద్దనే విషయం మరోసారి స్పష్టమైంది. సొంతగడ్డపై ఆడుతున్నామనే అడ్వాంటేజ్ ఉన్నా.. కొన్నిసార్లు మ్యాచ్‌లో ముందంజలో నిలిచినా.. వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాం. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత మెరుగవ్వాలి. సొంతగడ్డపై ఆడినా.. విదేశాల్లో ఆడినా.. క్రికెట్ ఎప్పుడూ ఆటగాళ్ల నుంచి పట్టుదల, ప్రయత్నాన్ని డిమాండ్ చేస్తుంది. బ్యాటింగ్ విభాగం సమష్టిగా విఫలమైంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ సిరీస్‌లో మాకు ఉన్న ఏకైక సానుకూల అంశం ఏంటంటే.. మా సొంత ప్రణాళికపై ఫోకస్ పెట్టడం.'అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.

## పాకిస్థాన్ కంటే దిగజారిన భారత్

సౌతాఫ్రికాతో ఘోర పరాజయం అనంతరం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో భారత్ స్థానం దిగజారింది. దాయాదీ పాకిస్థాన్ కంటే భారత్ స్థానం కిందకు పడిపోయింది. సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో రిషభ్ పంత్ సారథ్యంలోని భారత జట్టు 408 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో కోల్పోయింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై ఇది మూడో క్లీన్ స్వీప్ కాగా.. వరుసగా రెండోది. ఈ రెండు పరాజయాలు కూడా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలోనే ఎదురు కావడం భారత టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన రేకెత్తిస్తోంది. తాజా పరాజయంతో డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా ఏకంగా ఐదో స్థానానికి పడిపోయింది. శత్రు దేశం పాకిస్థాన్ భారత్ కంటే ముందు నిలవడం చూసి అభిమానులు జీర్ణించుకోలేకపోతునన్నారు. ఇంగ్లండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ 2027 సైకిల్ ప్రారంభించిన భారత్ ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో నాలుగు గెలిచి మరో నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతుండగా.. సౌతాఫ్రికా రెండో స్థానంలో నిలిచింది. శ్రీలంక, పాకిస్థాన్ భారత్ కంటే ముందున్నాయి. గత రెండేళ్లలో సొంతగడ్డపై భారత టెస్ట్ టీమ్‌కు ఇది రెండో వైట్‌వాష్. గతేడాది ఇదే సమయంలో భారత్ 0-3తో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ అయ్యింది. ఈ పరాజయంతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయింది. అప్పుడు కూడా స్పిన్ పిచ్‌లపై భారత బ్యాటర్లు విఫలమై మూల్యం చెల్లించుకున్నారు. ఆ తర్వాత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఓడిపోగా.. సీనియర్ ఆటగాళ్లు అయిన రవిచంద్రన్ అశ్విన్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. టెస్ట్ టీమ్ పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్.. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ప్రదర్శన కనబర్చి ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేశాడు. కానీ తాజా సిరీస్‌కు అతను గాయంతో దూరం కాగా.. టీమిండియా మునపటి ఫలితాన్నే రిపీట్ చేసింది. ఈ సిరీస్ తర్వాత టీమిండియాకు టెస్ట్‌ల్లో సుదీర్ఘ విరామం దొరకనుంది. వచ్చే ఏడాది అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడనున్న భారత్.. మళ్లీ 2027లోనూ టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. ఈ సుదీర్ఘ విరామాన్ని టీమిండియా టెస్ట్ టీమ్ బలోపేతానికి ఉపయోగించుకోవాలనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సొంతగడ్డపై పిచ్‌ల తయారి విధానంపై పునరాలోచన చేయాల్సి ఉంది. 2027లో సొంతగడ్డపై టీమిండియా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఆ లోపు టీమిండియా స్పెషలిస్ట్ టెస్ట్ బ్యాటర్లను తయారు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

# ఆస్ట్రేలియాపై గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలి

**టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**

**ప్రజల నుంచి మద్దతు అద్భుతం: రోహిత్ శర్మ**




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించాలని ఉందని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాపై గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉన్నామని తన మనసులోని మాటను బయటపెట్టాడు. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకటన కార్యక్రమానికి సూర్యకుమార్ యాదవ్‌తో పాటు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, భారత మహిళల వన్డే సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అప్‌కమింగ్ టీ20 టోర్నీకి రోహిత్ శర్మను బ్రాండ్ అంబాసిడర్‌గా ఐసీసీ నియమించింది. షెడ్యూల్ ప్రకటన సందర్భంగా హోస్ట్ జతిన్ సప్రు ఫైనల్లో ఏ జట్టును ఓడించాలనుకుంటున్నారని సూర్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించాడు. అందుకు సూర్య.. 'అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాను ఓడించాలనుకుంటున్నాం.'అని నవ్వుతూ బదులిచ్చాడు. ఇదే వేదికగా జరిగిన పురుషుల వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన భారత్.. ఆస్ట్రేలియా చేతిలో మాత్రం ఖంగుతిన్నది. తృటిలో టైటిల్ చేజార్చుకుంది. ఈ క్రమంలోనే అదే మైదానంలో ఆస్ట్రేలియాను ఓడించి ప్రతీకారం తీర్చుకునే యోచనలో తమ జట్టు ఉందని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ టోర్నీలో పాకిస్థాన్, యూఎస్ఏ, నెదర్లాండ్స్, నమీబియాతో భారత్ గ్రూప్-ఏలో ఉంది. ఫిబ్రవరి 7న అమెరికాతో ముంబై వేదికగా జరిగే మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. గ్రూప్-ఏ చాలా బాగుందని చెప్పిన సూర్యకుమార్ యాదవ్.. టీ20ల్లో ఎప్పుడు ఏ జట్టు బాగా ఆడుతుందో చెప్పలేమన్నాడు. ఇద్దరు బ్యాటర్లు, ఇద్దరు బౌలర్లు సత్తా చాటితే ఫలితం మారిపోతుందని అని చెప్పుకొచ్చాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ కుర్రాళు ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటారని సూర్య తెలిపాడు. ఆసియా కప్‌లో ఆ జట్టుతో తమకు మంచి అనుభవం దక్కిందని గుర్తు చేసుకున్నాడు. తమ ఫోకస్ ఎప్పుడూ క్రికెట్‌పైనే ఉంటుందని, ఇతర విషయాలను పట్టించుకోమని నవ్వుతూ బదులిచ్చాడు. ప్రపంచకప్‌లో పాక్‌తో పోరు మంచి మ్యాచ్ అవుతుందని చెప్పాడు. రోహిత్ శర్మ మాత్రం ఏ జట్టుతోనైనా పర్లేదని, కానీ భారత్ ఫైనల్ చేరాలని, విజేతగా నిలవాలని కోరుకుంటున్నానని తెలిపాడు. 'టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరాలని కోరుకుంటున్నా. గతంలో జరిగిందేదో జరిగిపోయింది(వన్డే ప్రపంచకప్ ఓటమి). అదే స్టేడియంలో ఆస్ట్రేలియాను ఫైనల్లో ఓడించాలని సూర్య ఎంతో బాధతో చెప్పాడు. భారత్.. ఏ జట్టుతో ఫైనల్స్ ఆడినా.. విజేతగా చూడాలని కోరుకుంటున్నా.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా విజేతగా నిలవాలని తాను కోరుకుంటున్నానని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ప్రత్యర్థి ఎవరనేది అనవసరమని టీమిండియా ఫైనల్ చేరడమే ముఖ్యమన్నాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ ఓటమికి ప్రతీకారం అవసరం లేదని, జరిగిందేదో జరిగిపోయిందని తెలిపాడు. సూర్యకుమార్ యాదవ్ బాధలో ఆసీస్‌ను ఓడించాలనే మాట అన్నాడని చెప్పాడు. హోస్ట్ జతిన్ సప్రు ఫైనల్లో ఏ జట్టును ఓడించాలనుకుంటున్నారని సూర్యకుమార్ యాదవ్‌ను ప్రశ్నించగా.. 'అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాను ఓడించి ప్రతీకారం తీర్చుకుంటాం'అని నవ్వుతూ బదులిచ్చాడు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రోహిత్ శర్మ గతం గతః అని, ఫైనల్లో ప్రత్యర్థి ఎవరా? అనేది అనవసరమని అభిప్రాయపడ్డాడు. 'టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరాలని కోరుకుంటున్నా. గతంలో జరిగిందేదో జరిగిపోయింది(వన్డే ప్రపంచకప్ ఓటమి). అదే స్టేడియంలో ఆస్ట్రేలియాను ఫైనల్లో ఓడించాలని సూర్య ఎంతో బాధతో చెప్పాడు. భారత్.. ఏ జట్టుతో ఫైనల్స్ ఆడినా.. విజేతగా చూడాలని కోరుకుంటున్నా. ఈ టోర్నీ భారత్‌లో జరుగుతుండటం గొప్ప విషయం. బ్రాండ్ అంబాసిడర్‌గా కొత్త పాత్రలో ఈ టోర్నీతో అనుబంధం కలిగి ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో పాల్గొనే 20 జట్లకు నా శుభాకాంక్షలు. వారికి మంచి అనుభూతి దక్కాలని, భారతదేశ ఆతిథ్యాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నా. ఈ టోర్నీ కోసం మా కుర్రాళ్లు ఉత్సాహంగా ఉన్నారు. భారత జట్టు తరఫున మైదానంలోకి దిగినప్పుడు ఆ భావోద్వేగం చాలా భిన్నంగా ఉంటుంది. సొంతగడ్డపై ఆడటం భిన్నమైన అనుభూతినిస్తోంది. ఒత్తిడి కూడా ఉంటుంది. కానీ ప్రజల నుంచి వచ్చే మద్దతు మాత్రం అద్భుతం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# ఫ్యాన్స్‌కు బాలయ్య 'డబుల్' ట్రీట్




బాలకృష్ణ ప్రస్తుతం హిట్ కాంబినేషన్ ను రిపీట్ చేస్తున్నాడు. తనకు ఇప్పటికే తనకు సింహా, లెజెండ్, అఖండ వంటి హిట్స్ ఇచ్చిన దర్శకుడు బోయపాటి శ్రీనుతో నాల్గోసారి 'అఖండ 2 తాండవం' సినిమాతో పలకరించబోతున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 5న ప్యాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ, భోజ్ పురి, అవధ్ భాషల్లో విడుదల కాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అఖండ 2 తాండవం పై అంచనాలు పెంచేశాయి. ఈ సినిమా తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో భారీ బిజినెస్ చేసినట్టు సమాచారం. అంతేకాదు బాలకృష్ణ కెరీర్ లో తొలి ప్యాన్ ఇండియా చిత్రం ఇదే కావడం గమనార్హం. ఓ హీరో సినిమా 65 యేళ్ల వయసులో ప్యాన్ ఇండియా లెవల్లో విడుదల కావడం అనేది మాములు విషయం కాదు. రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, మోహన్ లాల్ తర్వాత ఈ ఏజ్ లో ప్యాన్ ఇండియా వ్యాప్తంగా తన సినిమాను విడుదల చేసిన సీనియర్ హీరోగా బాలయ్య రికార్డులకు ఎక్కాడు. తాజాగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తోన్న చిత్రంలో చారిత్రక పాత్రలో కనువిందు చేయబోతున్నాడు. ఈ మూవీలో బాలకృష్ణ మరోసారి డ్యూయల్ రోల్లో చేయబోతున్నట్టు తెలుస్తుంది. ఇద్దరు రాజులు కత్తితో పట్టుకున్న ఫోటో ను విడుదల చేశారు. వీరిసింహారెడ్డి తర్వాత మరోసారి గోపీచంద్ మలినేనితో మరోసారి డ్యూయల్ రోల్ ఫార్ములాతోనే ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ఇక బాలయ్య, బోయపాటి శ్రీను విషయానికొస్తే.. వీళ్ల కాంబినేషన్ లో వచ్చిన అన్ని సినిమాల్లో బాలకృష్ణ డ్యూయల్ రోల్స్ చేయడం విశేషం. తాజాగా గోపీచంద్ మలినేని .. బాలకృష్ణ తో చేయబోతున్నది చారిత్రక నేపథ్యమున్న సినిమా. ఈ సినిమా పూజా కార్యక్రమానికి ఏపీ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరై స్క్రిప్ట్ ను నిర్మాతలకు అందజేశారు. బి.గోపాల్ తొలి షాట్ కు క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్ షాట్ కు బాబీ, బోయపాటి శ్రీను, బుచ్చిబాబు సమిష్టిగా డైరెక్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, అనేక మంది నిర్మాతలు హాజరయ్యారు.



## ఆస్కార్ రేసులో మహావతార్ నరసింహా..!

సినీ ప్రపంచంలో సంచలనాన్ని రేపిన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా' విడుదలైన సమయంలో,భారత్‌లో యానిమేషన్ సినిమాలు పెద్దగా ఆదరణ పొందవని భావన ఉండేది. అయితే ఆ అంచనాలను పూర్తిగా తారుమారు చేస్తూ ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని హెూంబలే సంస్థ సుమారు రూ.40 కోట్ల బడ్జెట్‌తో నిర్మించింది. థియేటర్లకు వచ్చిన వెంటనే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా, దేశవ్యాప్తంగా భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీర్ఘకాలిక ప్రదర్శనలో రూ.325 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అనేక రికార్డులను తిరగరాసింది. ఇప్పటికే తనదైన మార్క్ వేసుకున్న 'మహావతార్ నరసింహా' ఇప్పుడు మరో అరుదైన ఘనతను అందుకుంది ు అదే ఆస్కార్ రేసులో ప్రవేశించడం. ఇటీవల ప్రకటించిన ఆస్కార్ ప్రాథమిక జాబితాలో ఈ చిత్రానికి స్థానం దక్కింది. యానిమేషన్ విభాగంలో మొత్తం 35 చిత్రాలు నామినేషన్ కోసం పోటీపడుతున్నాయి. ఆ జాబితాలో 'మహావతార్ నరసింహా' కూడా ఉండటం గర్వకారణం. ఈ 35 చిత్రాల్లోంచి ఒక్కటిని అధికారిక నామినేషన్ కోసం ఎంపిక చేస్తారు. ఆ ఎంపికలో 'మహావతార్' నిలిస్తే, ఇండియా నుంచి ఆస్కార్ నామినేషన్‌కు ఎంపికైన తొలి యానిమేషన్ చిత్రం అనే చరిత్ర సృష్టిస్తుంది. అంతేకాక, నామినేషన్ దశను దాటితే, అవార్డు అందుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఎన్టీఆర్ సినిమా టైటిల్ డ్రాగన్ కాదా?




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – 'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న సినిమా 'డ్రాగన్ '. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్–ఇండియా మూవీపై సినీ వర్గాల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో 'కాంతారా' బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఫస్ట్ లుక్‌లు అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేరాయి. అయితే, ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కు 'డ్రాగన్' అనే పేరు ఫైనల్ కాలేదని నిర్మాతలు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ #NTR31. ప్రస్తుతం వర్కింగ్ టైటిల్ 'డ్రాగన్' అనే పేరు పెట్టారు. ఈ సినిమా 2024 చివర్లో అధికారికంగా అనౌన్స్ అయినప్పటికీ, ప్రిత్విరాజ్ సుకుమారన్, రాజమౌళి వంటి వాళ్లు 'డ్రాగన్' అని పలు సందర్భాల్లో ప్రస్తావించడంతో ఆ పేరే ఫైనల్ అన్న అభిప్రాయం ఏర్పడింది. దీంతో యాక్షన్, మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థియేటర్లలో కట్టిపడేస్తుందని ఇండస్ట్రీలో గట్టి నమ్మకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మూవీ టైటిల్ ఫైనల్ కాలేదని నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ స్పష్టం చేశారు.తాజాగా నిర్మాత మైత్రి రవి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.." 'డ్రాగన్' కేవలం టెంటేటివ్ టైటిల్స్‌లో ఒకటి మాత్రమే. ఇంకా చాలా ఆప్షన్స్ పరిశీలిస్తున్నాం. మూవీ స్కేల్, ఎన్టీఆర్ క్యారెక్టర్ డిమాండ్‌కు తగ్గట్టు అంతర్జాతీయ స్థాయి టైటిల్ ఫిక్స్ చేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జోరుగా సాగుతోంది. ఆఫస్ట్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ఆఫ్రికాలో భారీ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. 2026లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ కెరీర్‌లో ఇది ఒక యూనివర్సల్ బ్లాక్‌బస్టర్ అవుతుందని టాలీవుడ్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.అయితే ఇప్పుడు మూవీ నిర్మాతల కామెంట్స్ తో ఇంతకీ సినిమా టైటిల్ ఏంటీ? అనే చర్చ మొదలైంది. ఇండస్ట్రీలో ఏ విషయం దాచాలని ప్రయత్నించినా.. బయటపడకుండా కాపాడటం చాలా కష్టం. ముఖ్యంగా మూవీ అప్డేట్స్, టైటిల్స్ విషయంలో మూవీ మేకర్స్ ఎంత జాగ్రత్త పడినా.. ఎప్పుడో ఒక్కసారి బయటపడుతునే ఉంటాయి. గతంలో కొరటాల శివ – మెగాస్టార్ చిరంజీవి కాంబో మూవీ ఆచార్య సినిమా టైటిల్‌ను, అధికారికంగా ప్రకటించే ముందే చిరంజీవి స్వయంగా ఒక ఈవెంట్‌లో పొరపాటున బయటపెట్టారు. వెంటనే సారీ చెప్పినా, అప్పటినుంచి "మెగా లీక్స్" అనే పదం ఇండస్ట్రీలో బాగా ప్రాచుర్యం పొందింది.



## చిన్న సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది



అఖిల్ రాజ్, తేజస్వినీ ప్రధాన జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలైన వెంటనే ప్రేక్షకుల ప్రేమను సంపాదించి, థియేటర్లలో విజయవంతంగా దూసుకుపోతోంది. హృదయాన్ని హత్తుకునే ప్రేమకథగా విమ–ర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంటోంది. మొదటి రోజు నుంచే మంచి ఓపెనింగ్స్ నమోదవడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దృఢమైన స్థాయి సాధించింది. తాజాగా బయటకు వచ్చిన వసూళ్ల సమాచారం ప్రకారం, ఈ సినిమా మొదటి మూడ్రోజుల్లో రూ. 7.28 కోట్లు గ్రాస్ రాబట్టింది. ప్రత్యేకత ఏమిటంటే రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వస్తుండటం. తొలి రోజు కంటే రెండో రోజు, రెండో రోజు కంటే మూడో రోజు కలెక్షన్లు మరింత మెరుగ్గా రావడం చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ భారీగా థియేటర్లలో విడుదల చేశారు. ఈ చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్వినీ రావ్‌తో పాటు శివాజి రాజా, చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి, కవిత శ్రీరంగం తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

## ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం



ప్రముఖ నటి సమంత, మహిళలపై ఆన్‌లైన్‌లో పెరుగుతున్న వేధింపులను ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. ఈ లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'యూఎన్ విమెన్ ఇండియా'తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మహిళలపై డిజిటల్ ప్రపంచంలో జరుగుతున్న హింసను నివారించేందుకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ జరుగనున్న 16 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు సమంత ఇప్పటికే తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా తన 37 మిలియన్ల అనుచరులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను వెల్లడించారు. "సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, బెదిరింపులు, డీప్ ఫేక్ చిత్రాలు వంటి అనేక రూపాల్లో మహిళలు దాడులకు గురవుతున్నారు. గతంలో ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ ప్రపంచానికి మారాయి. ఇవి మనసును దెబ్బతీసేలా, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేలా ఉంటాయి," అని సమంత భావోద్వేగంతో తెలిపారు. తాను కూడా ఇలాంటి పరిస్థితులను పలుమార్లు ఎదుర్కొన్నానని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మహిళల్లో ఆన్‌లైన్ హింసపై అవగాహన పెంపొందించడం అని సమంత వివరించారు. డిజిటల్ వేధింపులను అరికట్టేందుకు మరింత ప్రభావవంతమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు తప్పనిసరిగా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. యూఎన్ విమెన్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగం కావడం తనకు గర్వకారణమని సమంత పేర్కొన్నారు.

## రామ్‌ను లవ్ యూ అనేసిన భాగ్యశ్రీ

రెండ్రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా కింగ్ తాలూకా మ్యూజిక్ కాన్సర్ట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. రామ్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. మీరు కింగ్ ఆఫ్ హార్ట్స్... ఐ లవ్ యూ అంటూ అందరిముందు ఓపెన్ అయ్యింది. దాంతో భాగ్యశ్రీ – రామ్‌ల మధ్య ఏదో జరుగుతుందని జనాలు ఫిక్స్ అయ్యారు. ఇంత జరుగుతున్నా రామ్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిచ్చింది. తాజాగా భాగ్యశ్రీ భోర్సేతో ప్రేమాయణంపై రామ్ పోతినేని స్పందించారు. ఆంధ్రా కింగ్ తాలూకా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఛానెల్‌తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 ఏళ్లకే కెరీర్ ప్రారంభించారు, చాలామంది హీరోయిన్స్‌తో వర్క్ చేశారు. ఇప్పటి వరకు మీ గురించి ఒక్క రూమర్ లేదు.. కానీ ఈ ఫిల్మ్‌కు ఎందుకో రూమర్స్ బయటికొచ్చాయని ఓ విలేకరి ప్రశ్నించారు. దీనికి రామ్ స్పందిస్తూ.. ఈ సినిమాకు పాట రాసినప్పటి నుంచి ఇది స్టార్ట్ అయ్యింది. లేకపోతే ఎందుకు స్టార్ట్ అవుతుంది. ఇప్పటి వరకు పాట రాయలేదు, ఫస్ట్ టైం పాట రాశా. ఈ సాంగ్ రాసేసరికి హీరోయిన్ ఎంపిక కూడా జరగలేదని రామ్ తెలిపారు. దాంతో భాగ్యశ్రీ భోర్సేతో తాను డేటింగ్ చేస్తున్నట్లుగా వస్తున్న ఊహాగానాలకు రామ్ పోతినేని చెక్ పెట్టినట్లయ్యింది. కాగా కెరీర్‌లో చాలా మంది హీరోయిన్లతో వర్క్ చేసినప్పటికీ రామ్ గురించి పెద్దగా ఎలాంటి రూమర్స్ రాలేదు. అలాంటిది భాగ్యశ్రీ భోర్సేతో ఆయన డేటింగ్ చేస్తున్నాడంటూ వార్తలు రావడం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. దీనికి కారణాలు లేకపోలేదు. రామ్, భాగ్యశ్రీలు పోస్ట్ చేసిన ఫోటోలు, వీడియోలలో బ్యాక్‌గ్రౌండ్, వస్తువులు ఒకేలా ఉండటంతో వీరిద్దరి మధ్య ఏదో జరుగుతుందన్న రూమర్స్‌కు బలం చేకూరేలా చేశాయి. ఇక ఎన్నడూ లేని విధంగా రామ్ పోతినేని రచయితా మారి ఈ సినిమా కోసం ఓ సాంగ్ కూడా రాశాడు. ఇది భాగ్యశ్రీని ఉద్దేశించి రాసినదేనని గాసిప్స్ వైరల్ అయ్యాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

## దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

• పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి




**పరిగి మున్సిపల్(మం) నవంబర్ 27(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకమైన అధ్యాయంగా నిలిచిన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైన రోజును పురస్కరించుకొని ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు.స్థానికంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ـ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షే రాష్ట్ర సాధనకు మలుపుతిప్పిన మహోద్యమ క్షణమని పేర్కొన్నారు. దీక్షా దివాస్ కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలోని త్యాగాలు, ఉద్యమ స్పూర్తిని స్మరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నిబంధనలు పాటించని వడ్డీ వ్యాపారులకు జరిమానాలు

• కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

**నిజామాబాద్, నవంబర్ 26( సమయం న్యూస్).** నిబంధనలు పాటించని వడ్డీ వ్యాపారులకు జరిమానాలు విధించడం జరిగిందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మనీ లెండర్స్ యాక్టు కేసులను అనుసరిస్తూ నిజామాబాద్ నగరానికి చెందిన ఐదుగురు వడ్డీ వ్యాపారులకు రూ. 25 వేల నుండి రూ. 50 వేల వరకు జరిమానాలు విధించామని వివరించారు. మొదటి తప్పుగా గుర్తించి సాధారణ జరిమానాలు మాత్రమే విధించడం జరిగిందని అన్నారు. వడ్డీ వ్యాపారాలు చేసే వారందరూ తప్పనిసరిగా తగిన అనుమతులు (లైసెన్స్) కలిగి ఉండాలన్నారు. నియమ, నిబంధనలు తు.చ తప్పక పాటించాలని, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారాలు నిర్వహించే వారిపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**భూత్పూర్ నవంబర్ 26(సమయం న్యూస్).:** భూత్పూర్ మండలంలో అమిస్తాపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు రోజు ఎలా చదువుతున్నారు? రోజు స్కూల్ కి వస్తున్నారా? ప్రశ్నలు

అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారుపాఠశాలకు హాజరు కానీ విద్యార్థులు ఉన్నారా అని కలెక్టర్ అడిగారు. ప్రతి రోజు పాఠశాలకు విద్యార్థులు హాజరై ఉపాధ్యాయులు చెప్పిన బోధన పాఠ్యాంశాలు విని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని వారికి తెలిపారు అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు అక్కడున్న ఉపాధ్యాయులతో తో మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థుల సంఖ్య ఎంత అని అడిగి పాఠశాల విద్యార్థుల సంఖ్య 144 ఉంది అని చెప్పారు . బోధన ప్రమాణాలు మరింత మెరుగుపరిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించింది. అక్కడున్న ఉపాధ్యాయులను స్కూల్ సమస్యలను గురించి అడిగి తెలుసుకుంది. నిర్మాణంలో టాయిలెట్స్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.

## నవంబర్ 28 న పెద్దపల్లి జిల్లాలోని దివ్యాంగులకు ఆటల పోటీల నిర్వహణ..

. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, నవంబర్-26 ( సమయం న్యూస్).:** నవంబర్ 28 న జిల్లాలోని దివ్యాంగులకు ఆటల పోటీల నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా లోని దివ్యాంగులకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భాముగా 18 సం.. రాల లోపు, 18 నుంచి 54 సంవత్సరాల వయసు వారికి ప్రత్యేకంగా అందులకు పరుగు పందెం, షాట్ పుట్, చెస్ పోటీలు, శారీరక వికలాంగులకు షాట్ పుట్, జవలింగ్ త్రో , క్యారం బోర్డు పోటీలు, బదిరులకు ,పరుగు పందెం,జవెలింగ్ , షాట్ పుట్ పోటీలు, మానసిక వికలాంగులకు పరుగు పందెం, షాట్ పుట్ ఆట పోటీలు ఉంటాయని తెలిపారు. ఆట పోటీలు ఉదయం 08:00 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయము గ్రౌండ్ నందు ప్రారంభమగును. ఆసక్తి గల దివ్యాంగులు అందరు హాజరై విజయవంతం చేసి పాల్గొనవలసిందిగా కలెక్టర్ ప్రకటనలో కోరారు.

# సైన్స్ మ్యూజియం భవనానికి పూర్వవైభవం తీసుకురావాలి

• జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ నవంబర్26( సమయం న్యూస్):** చారిత్రాత్మక కట్టడంగా ఉన్న జిల్లా సైన్స్ మ్యూజియం పురాతన భవనానికి పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ లోని ప్రభుత్వ పురాతన పాఠశాలలో గల జిల్లా సైన్స్ మ్యూజియం ఆధునీకరణ పనులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక సైన్స్ మ్యూజియం కరీంనగర్లో ఉండడంతో ఈ మ్యూజియం అభివృద్ధిపై కలెక్టర్ దృష్టి పెట్టారు. భవనం ఆధునీకరణతో పాటు విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం అందించే పరికరాలను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ఈ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతన కట్టడమైన సైన్స్ మ్యూజియం భవనానికి పూర్వరూపం రావాలని అన్నారు. మ్యూజియంలోని అన్ని గదులను అత్యాధునికంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆవరణలో అందమైన మొక్కలతో ఫౌంటెన్ ఏర్పాటు చేయాలని అన్నారు. మ్యూజియంకు కావలసిన పరికరాలను త్వరితగతిన తప్పించాలని ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాల ప్రదర్శన కోసం వేర-ంవేరుగా గదులను కేటాయించాలని అన్నారు. 15 రోజుల్లోగా మ్యూజియం ఆధునీకరణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా ప్రభుత్వం కాదని..దగా ప్రభుత్వం.

• మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజం



**హైదరాబాద్ నవంబర్26( సమయం న్యూస్) :** బుధవారం ఆదర్శనగర్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బిసి లకు రాజకీయం, విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు సంవత్సరాలు అవుతున్నా అమలు చేయకుండా బిసి లకు తీరని మోసం, దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వర్గాలకు న్యాయం చేస్తారనే నమ్మకంతో, ప్రభుత్వం, మంత్రుల విజ్ఞప్తి మేరకు అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లు పెడితే సంపూర్ణ మద్దతు తెలిపినట్లు చెప్పారు. పార్లమెంట్ లో బిల్లు ఆమోదించి 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్దత లభిస్తుందని బిల్లు పెట్టిన సమయంలోనే తాము ప్రభుత్వానికి స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మొదటి నుండి కూడా బిసి లకు 42 శాతం రిజర్వేషన్ ల విషయంలో చిత్తశుద్దితో లేదని విమర్శించారు. %చీ=%, చంద్రబాబు, వైస్సార్, కేసీఆర్ ల హయాంలో కూడా బిల్లును ఆమోదించి పంపినా ఆమోదం పొందలేదని తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ మాత్రం ఆలోచన లేకుండా హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. బిసి వర్గాలను మభ్య పెట్టే కుట్రతోనే బిల్లు, ఆర్డినెన్స్, జిఓ ల పేరుతో కాలయాపన చేసిందని, అనేక డ్రామాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. బిసి ల పట్ల నిజంగా ప్రేమ ఉంటే బిల్లుకు చట్టబద్దత కోసం రాష్ట్రపతిని ఎందుకు కలవలేదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పై ఎందుకు వత్తిడి తీసుకురాలేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో నిర్వహించిన ధర్నాకు కాంగ్రెస్ అద్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ వంటి అగ్రనేతలు ఎవరు కూడా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన కూడా పారదర్శకంగా జరగలేదని అసెంబ్లీలో ప్రభుత్వం అంగీకరించినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమాజంలో 50 శాతంకు పైగా ఉన్న బిసి లకు సర్పంచ్ ఎన్నికలలో 17.08 శాతం కేటాయించి అవమానిస్తారా ? అని ప్రశ్నించారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో రేవంత్ రెడ్డి బిసి లను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్పంచ్ ఎన్నికలను నిలిపివేయాలని, ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ లతో ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు దమ్ముంటే మీరు పార్టీ పరంగా ఇస్తామన్న 60 శాతం రిజర్వేషన్ తో జాబితాను వారం రోజులలో ప్రకటించాలని సవాల్ చేశారు. సాక్షాత్తు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యను ని తీసుకొచ్చి కామారెడ్డి సభలో ప్రకటించిన హామీలే అమలు కు నోచుకోలేదని అన్నారు. స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం బిసి లకు తీరని అన్యాయం చేస్తే బీహార్ ఎన్నికలలో రాహుల్ గాంధీ కులగణన లో తెలంగాణ ను ఆదర్శంగా ప్రచారం చేయడం విచారకరం అన్నారు. బిసి లకు ఏడాదికి 20 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయిస్తామని చెప్పినా నేటికీ ఒక్క పైసా ఇవ్వలేదని, కాంట్రాక్టులు ఇస్తామని అవి కూడా అమలు చేయడం మరిచారని ధ్వజమెత్తారు. కనీసం మీ చేతుల్లో ఉన్న నామినేటెడ్ పదవులలో బిసి లకు ఎంత మందికి న్యాయం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం లోని వివిధ శాఖలలో ఉన్నత పదవులలో కూడా బిసి లకు సముచిత స్థానం కల్పించలేదని, బిసి లలో సమర్థులైన అధికారులు లేరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో కి వచ్చిన తర్వాత ఒక్క బిసి వర్గం మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, ప్రజా వంచక ప్రభుత్వంగా మారిందని ధ్వజమెత్తారు. బిసి లను నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొందపెడతాం అని హెచ్చరించారు. బిసి లకు న్యాయం జరిగే విధంగా మంత్రులు ప్రభుత్వం పై తీవ్ర వత్తిడి తీసుకురావాలని కోరారు. పార్టీలకు అతీతంగా బిసి లు జిల్లాలలో మంత్రులు, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నాయకులు బిసి సమాజం ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని అన్నారు. తమతో కలిసి వచ్చే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసి సంఘాలను కలుపుకొని సమగ్ర కార్యాచరణ రూపొందించుకొని ప్రభుత్వం పై పోరాడతామని హెచ్చరించారు. తెలంగాణ తరహాలో మరో ఉద్యమం చేపడతామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బిసి సమాజం వదలబోదని హెచ్చరించారు.

# జి పి ఎన్నికలకు సర్వం సిద్ధం

• జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ నవంబర్26( సమయం న్యూస్) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పరిపాలన తీసుకున్న ఏర్పాట్లు, అనుసరించాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతం, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3 దశలలో ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, పోలింగ్ సామగ్రి పంపిణీ వంటి ప్రతీ అంశాన్ని మండల వారీగా సమీక్షిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సూచనలు అందించినట్లు వెల్లడించిన కలెక్టర్, ఎన్నికల సంబందిత ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖతో సమన్వయం పెంచి తగిన భద్రతా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించడంలో ఎలాంటి రాజీ ఉండదని, ఉల్లంఘనలు గమనించిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశం లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఎఎస్పీ అవినాష్ కుమార్, డి పి ఓ శ్రీనివాస్, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, మీడియా ప్రతినిధులు, పాల్గొన్నారు.